

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శుక్రవారం 12 జనవరి 2024



దేశంలో నాలుగో పరిశుభ్ర నగరంగా గుర్తింపు

క్లీన్ వైజాగ్

- స్వచ్ఛ సర్వేక్షణ్-23 ఫలితాలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- లక్షపైన జనాభా కలిగిన నగరాల కేటగిరీలో జాతీయస్థాయిలో నాలుగో ర్యాంక్
- 9,500 మార్కులకు 8879.30 మార్కులు
- ఢిల్లీలో అవార్డులు అందుకున్న రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి, జీవీఎంసీ మేయర్



విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో విశాఖపట్నం మరోసారి సత్తా చాటింది. జాతీయ స్థాయిలో నాలుగో పరిశుభ్ర నగరం (లక్ష జనాభాకు పైబడిన నగరాల కేటగిరీ)గా నిలిచింది. రాష్ట్ర స్థాయిలో చూసుకుంటే మొదటి స్థానంలో నిలిచింది. ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి హరదీప్‌సింగ్‌పురి స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీ ఫలితాలను ప్రకటించడంతోపాటు ర్యాంకులు సాధించిన నగరాలకు అవార్డులను అందజేశారు.

జాతీయ స్థాయిలో లక్షలోపు, పైబడి జనాభా ఉన్న నగరాలుగా విభజించి స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీ నిర్వహించారు. లక్ష జనాభా పైబడిన నగరాల కేటగిరీలో 4,477 నగరాలు పోటీపడ్డాయి. ఆయా నగరాల్లో కేంద్ర బృందాలు గత నెలలో వారం రోజుల పాటు పర్యటించాయి. పరిశుభ్రత, వీధులు, డోర్‌టుడోర్ చెత్త సేకరణ, విభజన, యార్డులకు తరలింపు, శాస్త్రీయ పద్ధతిలో పునర్వినియోగం, వీధులు, ఖాళీస్థలాల్లో చెత్త పోగుపడకుండా నివారించడం, వాణిజ్య ప్రాంతాలు, మార్కెట్లలో పరిశుభ్రత, నీటి వనరుల పరిశుభ్రత, ప్రజా మరుగుదొడ్లలో పరిశుభ్రత వంటివి పరిశీలించాయి. ఆయా నగరాలు రాష్ట్ర స్థాయిలో ప్రజలకు సేవలందించడంలో సాధించిన పురోగతి, తాగునీటి స్వచ్ఛత, మురుగునీటి పునర్వినియోగం, కాలుష్య నియంత్రణ, మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లు, స్థానిక సంస్థల పనితీరు, స్థానిక సంస్థల పనితీరుపై ప్రజల అభిప్రాయం పేరుతో మూడు అంశాలను ప్రాతిపదికగా తీసుకుని కేంద్ర బృందాలు సర్వే చేపట్టాయి. జీవీఎంసీకి స్టేట్ లెవెల్ ప్రోగ్రెస్ (రాష్ట్రస్థాయిలో ప్రజాపాలనలో సాధించిన పురోగతి) అంశంలో 4,830 మార్కులకు గానూ 4529.13 మార్కులు, సర్టిఫికేషన్ (పలు అంశాల్లో చూపిన ప్రతిభకు కేంద్ర ప్రభుత్వం జారీచేసిన సర్టిఫికెట్లు) అంశంలో 2,500 మార్కులకు గానూ 2,300 మార్కులు, సిటిజన్ వాయిస్ (జీవీఎంసీ పనితీరు, అందిస్తున్న సేవలు) అంశంలో 2,170 మార్కులకుగాను 2,050.12 మార్కులు మొత్తం 9,500కి 8879.30 మార్కులు రావడంతో విశాఖపట్నం దేశంలోనే నాలుగో పరిశుభ్ర నగరంగా నిలిచింది. ఇండోర్, సూరత్ నగరాలు 9,348.39 మార్కులు సాధించి ఉమ్మడిగా తొలిస్థానంలో నిలిస్తే, నవీ ముంబై 9,240.30 మార్కులతో మూడో స్థానంలో ఉంది. 8855.2 మార్కులతో భోపాల్ ... మిగతా 6వ పేజీలో



జీవీఎంసీ సాధించిన మార్కులు

కేటగిరీ	మొత్తం మార్కులు	సాధించిన మార్కులు
స్టేట్ లెవెల్ ప్రోగ్రెస్	4,830	4,529.13
సర్టిఫికేషన్	2,500	2,300
సిటిజన్ వాయిస్	2,170	2,050.12
మొత్తం	9,500	8,879.30

వచ్చే ఏడాది టాప్-3లో నిలవడమే లక్ష్యం



- సీఎం సాయికాంత్‌వర్మ, జీవీఎంసీ కమిషనర్

వచ్చే ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో తొలి మూడు ర్యాంకుల్లో నిలవడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తాం. ఈ ఏడాది పోటీలో ఎక్కడ వెనుకబడ్డామో గుర్తించి వాటిని అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తాం. ఈ ఏడాది బయో రెమిడియేషన్‌లో కొంచెం తక్కువ మార్కులు వచ్చాయి. ఇప్పటికే కాపులుప్పాడ డంపింగ్‌యార్డులో నాలుగు లక్షల టన్నుల వ్యర్థాలను పునర్వినియోగం చేశాం. మిగిలిన ఐదు లక్షల టన్నులను కూడా వచ్చే ఏడాదిలోపు పునర్వినియోగం చేసి యార్డును పార్కుగా మార్చుతాం. మిగిలిన అంశాల్లో ఈ ఏడాది మాదిరిగానే స్థిరమైన ప్రణాళికలు అమలుచేస్తే టాప్-3లో నిలవడం ఖాయం. నగర ప్రజలతోపాటు జీవీఎంసీ అధికారులు, స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్లు, ఎన్‌జీవోల సహకారంతోనే గత రెండేళ్లుగా నాలుగో ర్యాంకు సాధించగలిగాం.

సంవత్సరం	ర్యాంకు
2015	237
2016	5
2017	3
2018	7
2019	23
2020	9
2021	9
2022	4
2023	4

వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

- లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగింత
- మూడో జాబితాలోనూ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిని ప్రకటించని అధిష్ఠానం
- ప్రచారంలో పలువురి పేర్లు
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఎక్కడో స్థానం?



బొత్స ఝాన్సీ

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థినిగా మంత్రి బొత్స సత్యనారాయణ భార్య ఝాన్సీలక్ష్మి పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆమెను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆరు లోక్‌సభ, 15 అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జులను నియమిస్తూ గురువారం మూడో జాబితా విడుదల చేసింది. అందులో బొత్స ఝాన్సీలక్ష్మి పేరు ఉంది.

విజయనగరం జిల్లాకు చెందిన ఝాన్సీలక్ష్మి ఆ జిల్లా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా రెండుసార్లు, బొబ్బిలి, విజయనగరం ఎంపీగా ఒక్కోసారి పని చేశారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి విజయనగరం ఎంపీగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. తర్వాత ఆమె భర్త బొత్స సత్యనారాయణ వైసీపీలో చేరగా, 2019 ఎన్నికల్లో ఆమెకు పోటీ చేసే అవకాశం దక్కలేదు. 2024 ఎన్నికల్లో ఆమె విజయనగరం ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపగా, విశాఖ నుంచి ఎంపీగా బరిలోకి దింపాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది.గత నాలుగున్నరేళ్లుగా ఝాన్సీలక్ష్మి రాజకీయంగా క్రియాశీలకంగా లేరు. విశాఖలో అయితే ఆమె ఒక్క కార్యక్రమంలో కూడా పాల్గొన్న దాఖలాల్లేవు. అయినప్పటికీ ఆమెను విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీకి దింపాలని నిర్ణయించడంపై పార్టీ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నాయి.

రసవత్తరంగా 'అనకాపల్లి' రాజకీయం

అనకాపల్లి జిల్లాలో వైసీపీ రాజకీయం రసవత్తరంగా మారింది. పార్టీ అధిష్ఠానం గురువారం రాత్రి 21 మంది అభ్యర్థుల పేర్లతో మూడో జాబితా విడుదల చేసింది. అయితే అందులో అనకాపల్లి జిల్లా నుంచి ఒక్క స్థానం కూడా లేకపోవడం గమనార్హం. అనకాపల్లి ఎంపీ స్థానంతో పాటు పెందుర్తి, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను మారుస్తారని గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. అనకాపల్లి ఎమ్మెల్యే, జిల్లా మంత్రి గుడివాడ్ అమర్‌నాథ్‌కు ఎక్కడి నుంచి అవకాశం ఇస్తారో ఇంకా స్పష్టత రాలేదు. పెందుర్తి నుంచి అవకాశం ఇస్తారని ఊహాగానాలు వచ్చాయి. అక్కడ స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను మారుస్తారని చెప్పుకొచ్చారు. కానీ ఆయన బుధవారం తాడేపల్లి వెళ్లి సీఎం జగన్‌ను కలిశారు. ఈ నేపథ్యంలో ఆయనకే మళ్లీ అవకాశం ఇస్తామని చెప్పినట్టు గురువారం ప్రచారం జరిగింది. ఒకవేళ అదే నిజమైతే మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు సీటు ఎక్కడ కేటాయిస్తారో చూడాలి. తాజా పరిణామాలతో చోడవరం నుంచి అవకాశం కల్పించవచ్చునని ప్రచారం మొదలైంది. అయితే అక్కడి ఎమ్మెల్యే ధర్మశ్రీకి ఎక్కడ ఇస్తారనేది ప్రశ్నగా మారింది. ఆయన్ను అనకాపల్లి ఎంపీగా పోటీ చేయమంటున్నారని కొందరు చెబుతున్నారు. కానీ అనకాపల్లి ఎంపీగా ఆడారి తులసీరావు కుమార్తె పిళ్లా రమాకుమారి పేరు పరిశీలనలో ఉందని సమాచారం. అదే ... మిగతా 6వ పేజీలో

80 పైబడితే ఇంటి నుంచే ఓటు

- పోస్టల్ బ్యాలెట్ విధానంలో అవకాశం
- తొలిసారిగా రెండేళ్ల క్రితం కేరళలో అమలు
- జిల్లాలో 80 సంవత్సరాలు దాటినవారు 20,000పైగానే...



విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):
ఈసారి 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు ఇంటి నుంచి ఓటు (పోస్టల్ బ్యాలెట్) వేసేందుకు అవకాశం కల్పించనున్నారు. రెండేళ్ల క్రితం కేరళ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 80 ఏళ్ల దాటినవారు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆ తరువాత కర్ణాటక, గత నెలలో తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో కూడా వృద్ధులు ఇంటి నుంచి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ఇదే విధానం దేశంలోని అన్ని ప్రాంతాల్లో అమలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు ఇప్పటికే జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి.

జిల్లాలో 80 ఏళ్ల దాటిన వృద్ధులు సుమారు 20,000కుపైగా ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనెల 22వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల కానున్నది. ఆ తరువాత వృద్ధ ఓటర్ల సంఖ్యపై మరింత స్పష్టత రానున్నది. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులు, సర్వీస్ ఓటర్లు తమ ఓటును సీల్డ్ కవర్‌లో పోస్టు ద్వారా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపుతున్నారు. అయితే వృద్ధులు ఓటు (సీల్డ్ కవర్‌లో బ్యాలెట్ పేపర్) వేసేందుకు బాక్సులను వారి వద్దకు తీసుకువెళ్లేలా ఏర్పాట్లుచేస్తారు. ఓటు హక్కు ఇంటి నుంచి వినియోగించుకోవాలంటే 80 ఏళ్ల దాటిన వృద్ధులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి ... మిగతా 6వ పేజీలో

పీఎం పాలెం స్టేడియంలో వచ్చే నెల 2 నుంచి భారత్-ఇంగ్లాండ్ టెస్ట్ మ్యాచ్

- వివరాలు 6లో

కొనసాగుతున్న అంగన్వాడీల ఆందోళన



- వార్త I పేజీలో

జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న అంగన్వాడీల దీక్షా శిబిరంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, తదితరులు

ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు

- ఎన్నికల సంఘం ఆదేశాలు...
- విద్యా శాఖ నుంచి వివరాలు సేకరించిన కలెక్టర్
- జిల్లాలో సుమారు 3,200 మంది

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో గల సుమారు 3,200 మంది ఉపాధ్యాయుల వివరాలతో విద్యా శాఖ అధికారులు నివేదిక రూపొందించి జిల్లా ఉన్నతాధికారులకు పంపారు. మండల, జిల్లా పరిషత్, జీవీఎంసీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీ నుంచి ప్రధానోపాధ్యాయుడి వరకూ అందరి వివరాలు పంపించారు. ఉపాధ్యాయులతో పాటు విద్యా శాఖలో బోధనేతర సిబ్బంది వివరాలు కూడా సేకరించారు. వాస్తవానికి ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను దూరంగా ఉంచాలని వైసీపీ ప్రభుత్వం భావించింది. వారి స్థానంలో సచివాలయ సిబ్బందితో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంది. అయితే దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి భారీగా ఫిర్యాదులు వెళ్లడంతో టీచర్ల సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నుంచి సమాచారం రావడంతో టీచర్ల వివరాలు పంపాలని కలెక్టర్ మూడు రోజుల క్రితం జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు.

ఆ భూములు ఎలాగైనా అమ్మేద్దాం!

- 'రాజీవ్ స్వగృహ' భూముల వేలానికి మరోమారు ప్రకటన
- గతంలో డిపాజిట్ రూ.5 కోట్లు.. ఇప్పుడు రూ.కోటి మాత్రమే
- నాడు ఏడే ప్లాట్లు... నేడు 76 ప్లాట్లు
- అప్‌సెట్ ధర గజం రూ.60 వేలు
- దరఖాస్తుల స్వీకరణకు 30 వరకూ గడువు



ఎండాడలోని రాజీవ్ స్వగృహ స్థలం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
మధ్య తరగతి ప్రజలకు ఫ్లాట్లు (రాజీవ్ స్వగృహ) నిర్మించి ఇవ్వడానికి కేటాయించిన భూమిని ఏదో విధంగా అమ్మేసి సొమ్ము చేసుకోవాలని వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా యత్నిస్తోంది. విశాఖలో భూములంటే ఎగబడి కొనేస్తారని భావించి ప్రకటనలు గుప్పించింది. రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా విక్రయిస్తే అనుమానాలు వస్తాయని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంఎస్‌టీసీ (స్టీల్ మంత్రిత్వ శాఖ అనుబంధ సంస్థ)కు వేలం నిర్వహణ బాధ్యతలు అప్పగించింది.

రాజీవ్ స్వగృహ ప్రాజెక్టు కోసం ఎండాడ సర్వే నంబర్ 16లో వైఎస్ హయాంలో భూమి కేటాయించారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. అక్కడ ఇటీవల కాలంలో నిర్మించిన భారీ ప్రాజెక్టుల వల్ల రియల్ ఎస్టేట్ బూమ్ రావడంతో.. ఖాళీగా ఉన్న ఆ భూమిని గంపగుత్తగా ఎకరాల చొప్పున అమ్మడానికి వైసీపీ ప్రభుత్వం యత్నించింది. సుమారు 48 ఎకరాల భూమిని కేవలం ఏడు ప్లాట్లుగా విభజించి వేలానికి పెట్టింది. దరఖాస్తుదారులు డిపాజిట్‌గా కనీసం రూ.5 కోట్లు చెల్లించాలనే షరతు విధించారు. ఒక్కో ప్లాటు కనీస విస్తీర్ణం ఐదు ఎకరాలకు తక్కువ లేకుండా వేశారు. ఈ లెక్కన గజం రూ.70 వేలు చొప్పున కొనుగోలు చేసినా ఐదు ఎకరాల ప్లాటుకు రూ.170 కోట్లు పెట్టాల్సిన పరిస్థితి కల్పించారు. అంత భారీగా తెల్లధనం (వైట్ మనీ) పెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఒక్క దరఖాస్తు రాలేదు. రెండు, మూడుసార్లు ప్రయత్నాలు చేశారు. గత నెలలో కూడా ప్రకటన ఇచ్చి డిసెంబరు 27 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఇచ్చారు. పెద్దగా ఫలితం కనిపించలేదు. వాస్తవానికి ఈ భూమి వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో రెసిడెన్షియల్ జోన్‌లో ఉండగా వ్యాపారులు అమ్ముకోవడానికి వీలుగా మిక్స్‌డ్ జోన్ (వ్యాపారాలకు అనువుగా)లోకి మార్చారు.

విస్తీర్ణం తగ్గించి...ప్లాట్లు పెంచారు

పెద్దపెద్ద ప్లాట్లు వేయడం వల్ల ... మిగతా 6వ పేజీలో

పండుగ సందడి



కొనుగోలుదారులతో సీఎంఆర్ షాపింగ్‌మాల్ కిటకిట

- కొనుగోలుదారులతో కళకళలాడుతున్న షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు
- పోటాపోటీ ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునేందుకు వ్యాపారుల యత్నం
- నగరంలో సాధారణ రోజుల్లో రూ.10 కోట్ల వ్యాపారం
- గడచిన వారం రోజులుగా రూ.40 కోట్ల నుంచి 50 కోట్ల బిజినెస్

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):
మార్కెట్‌లో సంక్రాంతి సందడి కనిపిస్తోంది. నగరంలోని వస్త్ర దుకాణాలు/షాపింగ్‌మాల్స్ కొనుగోలుదారులతో కిటకిట లాడుతున్నాయి. గడిచిన వారం రోజుల నుంచి కొనుగోళ్లు బాగానే ఉన్నాయని, ఈ రెండు, మూడు రోజుల్లో ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కొనుగోలుదారులతో నగరంలో షాపింగ్ మాల్స్ వస్త్ర దుకాణాలు అధికంగా ఉండే జగదాంబ, డాబాగార్డెన్స్, ద్వారకానగర్, ఆశీల్‌మెట్ట తదితర ప్రాంతాలు సందడిగా ఉంటున్నాయి. సంక్రాంతికి దుస్తులు కొనుగోలు కోసం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా తూర్పు గోదావరి జిల్లా నుంచి కూడా నగరానికి వస్తుంటారని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే సాధారణ రోజులతో పోలిస్తే వ్యాపారం నాలుగు నుంచి ఐదు రెట్లు అధికంగా జరుగుతోంది. నగరంలో సాధారణ రోజుల్లో రూ.ఐదు నుంచి పది కోట్ల వ్యాపారం జరిగితే...గడిచిన వారం రోజుల నుంచి రూ.40 నుంచి రూ.50 కోట్ల వరకూ సాగుతున్నట్టు చెబుతున్నారు.

ప్రత్యేక ఆఫర్లతో ఆకట్టుకునే ప్రయత్నం

పండగను పురస్కరించుకుని నగరంలోని ప్రధాన వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. ఈ ఆఫర్లు ఉన్న దుకాణాలకు తాకిడి మరింత అధికంగా ఉంటోంది. దుకాణాలు తీయడానికి ముందే కొనుగోలు దారులు బారులు తీరుతున్నారు. ఇకపోతే, సంక్రాంతి పండగకు జరిగే వ్యాపారంలో దాదాపు 60 శాతం రెడీమేడ్ వస్త్రాలదే ఉంటుంది. కాగా, గతంలో పోల్చితే ఆన్‌లైన్ విక్రయాలతో పది నుంచి 15 శాతం మేర విక్రయాలు తగ్గినట్టు కొంతమంది వ్యాపారులు చెబుతున్నారు. మరికొందరు మాత్రం సాధారణ రోజుల్లో ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే ఎంతోమంది పండగకు మాత్రం దుకాణాలకు వస్తుంటారంటున్నారు.


బారులు తీరిన భక్తులు


సహస్ర ఘటాభిషేకంలో కలశాలు


అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో శిరీష

కనకమహాలక్ష్మికి సహస్ర ఘటాభిషేకం

» ముగిసిన మార్గశిర మాసోత్సవాలు
» చివరి గురువారం పూజలకు పోటెత్తిన భక్తులు

జగదాంబ కూడలి, జనవరి 11: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాస ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆఖరి గురువారం కావడంతో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రత్యేక పూజల్లో ఈవో కె.శిరీష, ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఒంటి గంట సమయంలో దర్శనాలకు భక్తులను అనుమతించారు. అప్పటినుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మార్గశిర ఆఖరి గురువారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక హోమం, త్రికాల పంచామృతాభిషేకం, కలశపూజ తదితర సేవలను ఘనంగా జరిపారు. జగన్నాథుని ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పాల్గొన్నారు. భక్తులకు బూరెలు, పులిహోర, స్వీట్‌ను భోజనంతో కలిపి వడ్డించారు. సాయంత్రం నాలుగు గంటల నుండి దర్శనాలను పూర్తి నిలిపివేశారు.

అనంతరం నిర్వహించిన అమ్మవారి సహస్రఘటాభిషేకంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కలశాలతో జలం తీసుకువచ్చి అభిషేకం చేశారు. రాత్రి 7గంటల తర్వాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులను తిరిగి దర్శనాలకు అనుమతించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తుతో పర్యవేక్షించారు.

కబ్జాదారుల కోసమే భూ హక్కు చట్టం

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


న్యాయవాదుల శిబిరంలో మాట్లాడుతున్న రామకృష్ణ

మహారాణిపేట, జనవరి 11: వైసీపీ ప్రభుత్వం దొడ్డిదారిన తీసుకువచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును నిరసిస్తూ విశాఖ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ యాజమాన్యహక్కు చట్టం భూ కబ్జాదారుల కోసం తీసుకువచ్చినట్టు ప్రజలకుఆందోళన చెందుతున్నారన్నారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చే యాలన్నారు. ప్రధాని మోదీ మెప్పు కోసం.. అమిత్ షా కాళ్లు పట్టడానికి ముఖ్యమంత్రి జగన్ ఈ చట్టం తీసుకువచ్చారన్నారు. నీతి అయోగ్, కేంద్ర ప్రభుత్వం సూచనలపై ఈ చట్టం తీసుకు వచ్చినట్టు వైసీపీ ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

విశ్వసనీయత కోల్పోయిన వైసీపీ సర్కార్

» పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు


సమావేశంలో గణబాబు, గండి బాబ్జీ

మహారాణిపేట, జనవరి 11: ప్రజల్లో వ్యతిరేకతతో వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేల మార్పు చేస్తున్నట్టు ప్రచారం చేస్తున్నా.. దీని వెనుక అధికార పార్టీపై ప్రజలు విశ్వసనీయత కోల్పోయిందన్నది వాస్తవంగా గుర్తించాలని పశ్చిమ నియోజక వర్గం శాసన సభ్యుడు పీవీజీఆర్ గణబాబు అన్నారు.గురువారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. ముఖ్య మంత్రి జగన్‌ను ఇక, ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్నారు. ఈ స్థితిలో టీడీపీ సభలు విజయవంతమవుతుండగా, అధికార వైసీపీ చేస్తున్న సామాజిక సాధికార యాత్ర ఆదరణ కోల్పోయిందన్నారు. ప్రభు త్వంలో ఆర్థిక సంక్షోభంతో ప్రజలను భయాభ్రాంతులకు లోనుచేస్తోందన్నారు. సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు జగన్ మోసాలను అంతమొందించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి పాసర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

జయహో బీసీ కార్యక్రమం

మహారాణిపేట: టీడీపీ పాలనలో బీసీ వర్గాలకు న్యాయం చేకూరుతుందని గండి బాబ్జీ అన్నారు. దక్షిణ నియోజకవర్గంలో గురువారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు.బీసీ కమిటీ అధ్యక్షుడు టి విజయ్ కుమార్ , చింతాడ వరకుమార్ సీరం రాజేశ్, జి నరసింహాచారి పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

23, 639 మందికి 'జగనన్నతోడు': కలెక్టర్

మహారాణిపేట, జనవరి 11: జగనన్న తోడు పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 23,639 మంది లబ్ధిపొందినట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున తెలిపారు. వృత్తి కళాకారులు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారుల ఆదాయాలను మరింతగా మెరుగు పరిచేందుకు ని ర్దేశించిన జగనన్న తోడు పథకం 8 వ విడత నిధులను గురువారం ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంనుంచి వీడియో కా న్ఫరెన్స్ ద్వారా విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా 60.72 లక్షల వడ్డీ రాయితీ, 17,469 మందికి 14.48 లక్షల కొత్త రుణాల నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ పాపినాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు.

40 మంది ఫార్మా సిటీ భూ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు

మహారాణిపేట, జనవరి 11: పరవాడ ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన 40 మంది నిర్వాసితులకు గురువారం లాటరీ ద్వారా ఇళ్ల స్థలాలనుకేటాయించినట్టు జాయింట్ కలెక్టర్ కే విశ్వనాథన్ తెలి పారు. లోకాయుక్త ద్వారా 25 మంది, స్పందన ద్వారా 15 మంది మొత్తం 40 ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తులు అందాయని తెలిపారు. వీరికి లాటరీ ద్వారా స్థలాలను కేటాయించామన్నారు. రెండు రోజుల్లో అందించనున్నట్టు చెప్పారు.

ఢిల్లేశ్వరరావుకు మిస్టర్ ఏయూ శరీర సౌష్టవ టైటిల్


టైటిల్ విజేత ఢిల్లేశ్వరరావు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 11: ఏయూ అంతర్ కళాశాలల శరీర సౌష్టవ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థి వై.ఢిల్లేశ్వరరావు మిస్టర్ ఏయూ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. గురువారం కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ టోర్నీలో కాలేజీ బాడీ బిల్డర్లు ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని సొంతం చేసుకున్నారు. బాడీ బిల్డింగ్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కే గురునాధరావు, టి.రాము, డాక్టర్ రత్నాకర్, ఈవీవీఎస్.శివకుమార్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీ.రమణాచారి (రైల్వే) కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, గంగా భవాని పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గంలో 40 వేల దొంగ ఓట్లు

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు


మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, జనవరి 11: ఉత్తర నియోజకవర్గంలో ఇంటింటికి ఓటర్ పరిశీలన జరిగిందని, ఈ నేపథ్యంలో 40 వేల మంది దొంగ ఓట్లు ఉన్నట్టు గుర్తించినట్టు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. బోగస్ ఓట్లపై జిల్లా అధికారులు డీఆర్‌వో, ఈఆర్‌ఓకి ఫిర్యాదు చేసినట్టు ఆయన వివరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరులో ఇచ్చిన డ్రాఫ్టలిస్ట్‌లో దొంగ ఓట్లను డిలీట్ చేయకుండా ఉంచారని, దీనిపై రా ష్ట్ర ఎన్నికల అధికారికి సమాచారం అందించినట్టు చెప్పారు.

కనకమహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరీ


అలంకరణలో కన్యకాపరమేశ్వరి

మహారాణిపేట, జనవరి 11: కన్యకాపరమేశ్వరి ఆలయంలో మార్గశిర మాసం ఆఖరి గురువారంపురస్కరించుకుని అమ్మవారు కనక మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. 108 బంగారు పుష్పాల నివేదనలతో కూడిన ప్రత్యేక అలంకరిం చారు. సుమారు 250 మంది మహిళలతో సా మూహిక కుంకుమ పూజలు, విష్ణు సహ స్రపారాయణం నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్య దర్శులు ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామ కృష్ణారావు, సుగుణ, శివ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సంక్రాంతి వేడుకలు

డాబాగార్డెన్స్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సేవా కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం సంకాంత్రి వేడుకలను నిర్వహించారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్ లో నిర్వహించిన ఈ వేడుకలను జీవీఎంసీ జేడీ వై.శ్రీనివాసరావు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి కే రామేశ్వరి హాజరై ప్రారంభించారు. గంట్ల శ్రీనుబాబు, సత్యవతి, మురళీ, పావని, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మచిత్రం పుస్తకావిష్కరణ

సీతంపేట, జనవరి 11: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శ్రీ విశ్వ కళ్యాణ భారతీ సేవా సంఘం ఆధ్వర్యంలో రచయిత కిలాడి సత్యనారాయణ రచించిన ఆత్మచిత్రం పుస్తకాన్ని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆవిష్కరించారు.జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ కేదార్నాథ్ సింగ్ కవిత్వాన్ని అనువదించడం ప్రశంసనీయమన్నారు. డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, వైద్య నిపుణులు డాక్టర్ బిపిఎస్ కల్యాణి, ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, గీతం యూనివర్శిటీ ప్రొఫెసర్ భగవతం, రచయిత కొత్తగూడెం, పోర్టు ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ దూబే, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'యూనియన్ల లబ్ధికే మున్సిపల్ సమ్మె'

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యూనియన్ల ఉనికికి, నేతల లబ్ధి కోసమే మున్సిపల్ కార్మికులతో సమ్మె చేయించారని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ జనరల్ వీవీవామనరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులసమావేశంలో మాట్లాడారు. సమానపనికి సమానవేతనండిమాండ్‌గా మున్సిపల్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యో గులు సమ్మెకు దిగితే, దానిపై కనీసం చర్చ జరగకుండానే సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు యూనియన్ల నేతలు విజయోత్సవసభ నిర్వహించడం విడ్డూరమన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె విరమణ

విశాఖపట్నం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టుపరిధిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం రాత్రి సమ్మె విరమించారు. సర్వీస్ రెగ్యులేషన్, హెచ్‌ఆర్‌పాలసీ అమలు, సమాన పనికి సమాన వేతనం వంటి డిమాండ్ల సాధనకు గతనెల 20వతేదీ నుంచి సమ్మెలోనికి వెళుతూ జిల్లా కేంద్రాల్లో ఆందోళన చేపట్టారు. అయితే రాష్ట్ర ప్రభుత్వంతో ఉద్యోగుల జేఏసీ విజయవాడలో చేపట్టిన చర్చల మేరకు సమ్మె విరమించారు. జిల్లాలో సుమారు 320మంది ఉద్యోగులు గురువారం విధుల్లో చేరారు.

హిందీ టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాఖపట్నం, జనవరి 11: విశ్వ హిందు దివాస్‌ను పురస్కరించుకుని వాల్తేరు డివిజన్ హిందీ రాజ భాష శాఖ రూపొందించిన హిందీ టేబుల్ క్యాలెండర్‌ను డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అలాగే ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో ఏర్పాటు చేసిన హిందీ లైబ్రరీని ప్రారంభించారు. అనంతరం హిందీ కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. క్యాలెండర్‌ను రూపొందించిన హిందీ శాఖ సూపరింటెండెంట్ సుదీప్త అభినందించారు. ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి భారత్, ఇంగ్లాండ్ మధ్య టెస్ట్ మ్యాచ్

» 2 వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం » ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 26నుంచి టికెట్ల విక్రయం » ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి



మాట్లాడుతున్న శరత్‌చంద్రారెడ్డి తదితరులు

మధురవాడ, జనవరి 11: పోతిన మల్లయ్యపాలెం ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో వచ్చే నెల 2 నుంచి ఆరో తేదీ వరకు భారత్, ఇంగ్లాండ్ మధ్య రెండో టెస్ట్‌మ్యాచ్ జరగనున్నట్టు ఏసీఏ అధ్యక్షుడు పి.శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం స్టేడియంలో మీడియాతో మాట్లాడారు. మ్యాచ్ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, ఏసీఏ ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించామన్నారు. ఇక్కడి స్టేడియంలో ఇది మూడో టెస్ట్‌మ్యాచ్ అని, మ్యాచ్‌కు నగర పరిధిలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తామన్నారు. కాగా ఈనెల 26వ తేదీ నుంచి ఆరో తేదీ వరకు స్టేడియంతో పాటు నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆఫ్‌లైన్‌లో టికెట్లు విక్రయిస్తామన్నారు. ఈనెల 15 నుంచి ఆన్‌లైన్‌లో పేటీఎం యాప్ ద్వారా టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. రోజువారీ టికెట్ల ధరలు రూ.100, రూ.200, రూ.300, రూ.500గా నిర్ణయించామన్నారు. మ్యాచ్ మొత్తానికి (సీజనల్ టికెట్) రూ.400, రూ.800, రూ.1000, రూ.1500గా నిర్ణయించామన్నారు. అనంతరం కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ టెస్ట్‌మ్యాచ్‌కు వచ్చే క్రికెటర్లతో పాటు క్రీడాభిమానులకు తగిన భద్రత కల్పిస్తామన్నారు. తాగునీరు, పారిశుధ్యం నిర్వహణ, పార్కింగ్ తదితర ఏర్పాట్లు పరిశీలిస్తున్నామన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ ఎప్పటిలాగే క్రికెటర్లకు మూడంచెల భద్రత కల్పిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని వివరించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, ఏసీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో సోలార్ ట్రై సైకిళ్లు


సోలార్ పవర్‌తో నడిచే ట్రైసైకిళ్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం శివార్లలో గల ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో సోలార్ విద్యుత్‌తో నడిచే ట్రైసైకిళ్ల (వీల్ చైర్లు)ను తయారుచేశారు.ఢిల్లీకి చెందిన ఐసీఎంఆర్ సంస్థ దీనినిరూపొందించగా, ఇక్కడి మెడ్‌టెక్ జోన్‌లో తయారుచేశారు. దీనిని గురువారం ఆవిష్కరించారు. కాలుష్య నివారణకు, భద్రతకు ఇది దోహదపడుతుందని మెడ్‌టెక్ జోన్ అధికారులు పేర్కొన్నారు.

క్లీన్ వైజాగ్

... 5వ పేజీ తరువాయి

ఆరో స్థానం, 8,751.3 మార్కులతో విజయవాడ ఆరు, 8,728.3 మార్కులతో న్యూఢిల్లీ ఏడు, 8,624.50 మార్కులతో తిరుపతి ఎనిమిది, 8,601.30 మార్కులతో హైదరాబాద్ తొమ్మిది, 8,595.2 మార్కులతో పూణే పదో స్థానంలో నిలిచాయి.

237 నుంచి నాలుగో ర్యాంక్‌కు....

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛసర్వేక్షణ్ పోటీకి శ్రీకారం చుట్టినప్పటి నుంచి విశాఖ నగరం క్రమంగా ర్యాంకులను మెరుగుపరుచుకుంటూ వస్తోంది. పోటీ ప్రారంభించిన తొలిఏడాది 2015లో 237, 2016లో ఐదు, 2017లో మూడు, 2018లో ఏడు, 2019లో 23, 2020, 2021లో తొమ్మిది, 2022తోపాటు 2023 పోటీల్లో నాలుగో ర్యాంకు దక్కించుకుంది.

వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

... 5వ పేజీ తరువాయి

కుటుంబంలో తులసీరావు కుమారుడు ఆడారి ఆనంద్‌కుమార్‌కు విశాఖ పశ్చిమ నుంచి పోటీ చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఎప్పుడో వచ్చేసింది. ఒకే కుటుంబంలో ఇద్దరికి టిక్కెట్లు ఇస్తారా?...అని కొందరు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. లేదంటే...గవర సామాజిక వర్గంలో ఇంకెవరికైనా అవకాశం ఇవ్వవచ్చునంటున్నారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకులు బొడ్డేటి కాశీ విశ్వనాథం అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఎంపీగా ఎవరు పోటీలో దిగినా భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందుకు తగిన ఆర్థిక వనరులు ఉన్నవారినే పార్టీ ఎంపిక చేస్తుంది. ఇదిలావుండగా సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సత్యవతి మరోమారు తనకు అవకాశం ఇవ్వాల్సిందిగా పార్టీ పెద్దలను కోరారు. ఒకవేళ సమీకరణాల వల్ల ఎంపీ సీటు ఇవ్వలేకపోతే అసెంబ్లీ టికెట్ అయినా ఇవ్వాలని ఆమె కోరుతున్నారు.

80 పైబడితే.. ఇంటి నుంచే ఓటు

... 5వ పేజీ తరువాయి

అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులు ఖరారైన తరువాత అందుకు అవకాశం కల్పిస్తారు. పోలింగ్‌కు ఒకటి, రెండు రోజులు ముందు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి నేతృత్వంలో పోలింగ్ సిబ్బంది వృద్ధుల ఇంటికి వెళ్లి బ్యాలెట్ పత్రం ఇస్తారు. ఓటు వేసిన తరువాత సీల్డు కవర్‌లో పెట్టి తమతో తీసుకువెళ్లిన బాక్సులో వేసే అవకాశం కల్పిస్తారు. రాజకీయ పార్టీలు నియమించుకునే పోలింగ్ ఏజెంట్లు కూడా వారి వెంట ఉంటారు. కాగా ఇంటి వద్ద నుంచి ఓటు వినియోగించుకోదలచిన వారు ఎక్కువ ఉంటే అదనపు సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని రిటైర్డు తహసీల్దార్ ఒకరు అభిప్రాయపడ్డారు. అయితే 80 ఏళ్లు దాటినవారు పోలింగ్ కేంద్రానికి వెళ్లి కూడా ఓటు వేసుకోవచ్చు.

ఆ భూములు ఎలాగైనా అమ్మేద్దాం!

... 5వ పేజీ తరువాయి

ఎవరూ ముందుకు రావడం లేదని గ్రహించి రూటు మార్చారు. 48 ఎకరాల భూమిని ఈసారి 76 ప్లాట్లుగా విభజించారు. మూడు వేల గజాల మొదలుకొని పది వేల గజాల వరకు ప్లాట్లుగా విభజించారు. అప్‌సెట్ ధర కూడా తగ్గించారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధర గజం రూ.50 వేలు ఉండగా, రాజీవ్ స్వగృహ అధికారులు ఇప్పుడు అప్‌సెట్ ధర గజం రూ.60 వేలుగా నిర్ణయించారు. అక్కడ నుంచి ఎవరు ఎక్కువ ధర పెట్టడానికి ముందుకువస్తే వారికి ప్లాట్లు ఇస్తారు. వేలంలో పాల్గొనే వారు ఇప్పుడు కోటి రూపాయలు డిపాజిట్‌గా చెల్లిస్తే సరిపోతుందని నిబంధన మార్చారు. రాజీవ్ స్వగృహకు ఈ భూమి కేటాయించినప్పుడు అంతా కొండ ప్రాంతం. మొదట్లో కొండను తవ్వి పైకి రహదారి నిర్మించడానికి రూ.20 కోట్లు వెచ్చించారు. తాజాగా దీనిని లేఅవుట్‌గా మార్చినప్పుడు మరో రూ.10 కోట్లు పెట్టి రహదారులు, కాలువలు నిర్మించారు. మొత్తంగా దీనిపై రూ.30 కోట్లు పెట్టారు. ఇప్పుడు అక్కడ ఎలా ఉంటే అదే స్థితిలో విక్రయిస్తామనే విధానంలో వేలానికి పెట్టారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 30 వరకు గడువు ఇచ్చారు. 31వ తేదీన ఆన్‌లైన్‌లో వేలం పెడతారు. ఈసారి ఎలాంటి ఆదరణ వస్తుందో చూడాలి. ఇంకో రెండు నెలల్లో ఎన్నికల ప్రకటన వస్తుంది. ఇటువంటి సమయంలో ఈ భూమి వేలానికి ఎటువంటి స్పందన లభిస్తుందో చూడాల్సి ఉంది.

కోస్టుగార్డును సందర్శించిన కస్టమ్స్ అధికారులు


పర్యటనకు వచ్చిన కోస్టగార్డులు

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, పుణే, వెల్లింగ్‌టన్ ప్రాంతాల్లో హయ్యర్ కమాండ్ కోర్సులు అధ్యయనం చేస్తున్న 529 మంది విద్యార్థి అధికారులు, వారి బోధన సిబ్బందికి తూర్పు నౌకాదళం ఆతిథ్యమిచ్చింది. నాలుగు రోజుల పర్యటనకు వచ్చిన వీరితో ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సముద్ర పర్యటనకి తీసుకెళ్లి అన్నీ వివరించారు.

529 మందికి ఆతిథ్యం

కస్టమ్స్ విభాగంలో ప్రివెంటివ్ అధికారులుగా పనిచేస్తున్న వారికి కోస్టుగార్డుపై అవగాహన కు శుక్రవారం నౌకల సందర్శనకు తీసుకెళ్లారు. కోస్టుగార్డు పనితీరుపై అవగాహన కల్పించారు. విధుల్లో సామర్థ్యంపెంపులోభాగంగా దీనిని నిర్వహించారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా జరపాలి: జనసేన

సీతంపేట, జనవరి 11: ఎన్నికలను నిష్పక్షపాతంగా జరపాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ కేంద్రంగా రాష్ట్రంలో జరుగుతున్న ఓట్ల తొలగింపుపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి వివరించారన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు నాగలక్ష్మి చౌదరి, త్రివేణి, కిరణ్ ప్రసాద్, మంతా నాగ సుధ, రూప, పోతు వెంకట ప్రసాద్, బంటు రవి పాల్గొన్నారు. పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రచార కమిటీ చైర్మన్ బన్నీ వాసు రూపొందించిన మన ఊరు-మన ఆట కార్యక్రమం పోస్టర్‌ని నాగలక్ష్మి ఆవిష్కరించారు.

సాయి మందిరంలో వైద్య శిబిరం

అక్కయ్యపాలెం : గ్రేటర్ 42వ వార్డు రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయిధ్యానమందిరం ప్రాంగణంలో మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి, మెడికవర్ ఆస్పత్రులు, సంధ్య డెంటల్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు వివిధ వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, ఒప్టోమెట్రిస్ట్ సునీత, కౌన్సెలర్ రుషిక, మెడికవర్ ఆస్పత్రి ప్రతినిధి కె.అప్పారావు, సంధ్య డెంటల్ క్లినిక్ వైద్యురాలు రేష్మ పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షతల పంపిణీ


అక్షతలను ఊరేగిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జనవరి 11: గ్రేటర్ 42, 43, 44 వార్డుల్లో అయోధ్య రాముని అక్షతల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. శ్రీనివాస నగర్‌లో ప్రాంతంలోని సాయిబాబా, వేంకటేశ్వర స్వామి ఆలయాల నుంచి ముందుగా పురవీధుల్లో స్వామివారి అక్షతలతో బీజేపీ వార్డు అధ్యక్షుడు మోకిని సత్తిబాబు రాధ దంపతుల ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. నాయకులు ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి, ఆలయ చైర్మన్ నాయుడు, అర్చకుడు సంతోష్‌కుమార్, అంకారావు, కొండబాబు పాల్గొన్నారు.



పండక్కి ఊరెళుతున్నారా..
తస్మాత్ జాగ్రత్త!

సంక్రాంతి సమయంలో దొంగతనాలకు అవకాశం ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

ఉక్కుటౌన్‌షిప్/కూర్మన్నపాలెం, జనవరి 11: మహా నగరంలో సంక్రాంతి సందడి మొదలైంది. పాఠశాలలు, కాలేజీలకు సెలవులు ప్రకటించడంతో సొంతూళ్లకు వెళ్లేవారితో అప్పుడే రైళ్లు, బస్సులు కిటకిటలాడుతున్నాయి. చాలామందికి రైళ్లలో రిజర్వేషన్లు దొరక్కపోవడంతో అందుబాటులో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తూ స్వస్థలాలకు బయలుదేరుతున్నారు. ఇదే అదనుగా జేబులు, ఇళ్లను గుల్లచేసే దొంగల ముఠాలు చోరీలకు పాల్పడే పనిలో నిమగ్నమవ్వడం సాధారణంగా మారింది. పోలీసులు ఎంత నిఘా పెట్టినా, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రజలు ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా దొంగలకు అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదు. ఈ క్రమంలో గత కొద్ది రోజులుగా పలు ప్రాంతాల్లో సంక్రాంతికి ఊరెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు, ఆటోల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా పండగ నేపథ్యంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే వారంతా ముందుగా సమీపంలోని స్టేషన్లకు సమాచారం అందిస్తే ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా పెడతామని పోలీసులు సూచిస్తున్నారు. ఎక్కడైనా ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్టు కనిపిస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలని కోరుతున్నారు. గతంలో టౌన్‌షిప్‌లో వరస దొంగతనాలు జరగడంతో పోలీసులు గస్తీ నిర్వహించి బందోబస్తు పెంచడంతో చోరీల సంఖ్య చాలావరకు తగ్గింది. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో గస్తీ పెంచామని, ఇతర ప్రాంతాలకు వెళ్ళే వారు ఇంట్లో విలువైన వస్తువులు ఉంచరాదని, తెలిసిన వారిని ఎవరినైనా ఇంట్లో ఉంచి వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.

స్వస్థలాలకు వెళ్లేవారంతా ఇళ్లలో విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉంచవద్దు

క్యాంప్ వెళుతున్నట్టు సమాచారం అందిస్తే ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా పెడతామని వెల్లడి

అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా..

దొంగతనాల నియంత్రణకు ప్రజలను చైతన్యపరుస్తూ పోలీసులు పలు కాలనీలు, అపార్టుమెంట్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పలువురు తగిన జాగ్రత్తలను పాటించడం లేదు. దీంతో చోరీలు జరుగుతున్నాయి. అందువల్ల పండగ రోజుల్లో నగరంలోని అన్ని ప్రాంతాల్లో పోలీసుల గస్తీని మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో మేలు

ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లు వెళ్లే వాళ్లంతా అనుక్షణం తమ గృహాలు పోలీసుల నిఘాలో వుండేలా ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) యాప్ దోహదపడుతుంది. ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్నాక వినియోగదారులు తమ పేరు,



చిరునామా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం ప్రతీ వినియోగదారుడికి ఒక యూజర్ ఐడీ కేటాయించడం జరుగుతుంది. ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లే సమయంలో యూజర్ ఐడీని వినియోగించి యాప్ ద్వారా ఊరు వెళ్లే సమయం, తిరిగి వచ్చే తేదీని మెసేజ్ రూపంలో పెడితే స్థానిక పోలీసులు ఆ ఇంటికి సీసీ కెమెరా, అలారాన్ని ఇంటికి అమరుస్తారు. తద్వారా పోలీస్ నిఘాతో కంట్రోలు రూమ్‌కు అనుసంధానం అవుతుంది. అప్పుడు ఆ సంబంధిత ఇంట్లో చిన్న శబ్దం వచ్చానా కంట్రోలు రూమ్‌లో అలారం మోగుతుంది. తక్షణమే పోలీసులు అప్రమత్తమై తగిన చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం ఎలాంటి రుసుం తీసుకోకుండా పోలీసులు చోరీల నియంత్రణకు కృషి చేస్తున్నారు. ఈ యాప్ గురించి కూడా వారు ప్రచారం సాగిస్తున్నారు.

ఇంట్లో విలువైన వస్తువులు ఉంచొద్దు



సంక్రాంతి పండగ నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే వాళ్లంతా ఇంట్లో విలువైన వస్తువులను ఉంచకూడదు. కుటుంబ సమేతంగా ఊరేళితే ముందుగా తమకు సమాచారం అందిస్తే ఆయా ప్రాం తాల్లో ప్రత్యేక నిఘా పెడతాం. ప్రజలకు సేవలు అందించేం దుకు తమ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారు.

-వి.శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్ సీఐ

అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా సమాచారం అందించండి



తమ ప్రాంతంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే తక్షణమే మాకు సమాచారం అందించాలి. చోరీలకు సంబంధించి ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నాం. సంక్రాంతి పండగ వేళ ఇతర ప్రాంతాలకు వెళ్లేవారంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మాకు ముందస్తు సమాచారం అందిస్తే ఆయా ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేస్తాం. ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉంచడం శ్రేయస్కరం కాదు.

-బి.శ్రీనివాసరావు, దువ్వాడ సీఐ



ఆధునీకరించిన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి. చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, తదితరులు ఉన్నారు

రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక, జనవరి 11: రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆధునీకరించిన గాజువాక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న రెవెన్యూపరమైన సమస్యలను వైసీపీ ప్రభుత్వం పరిష్కరించిందని, ప్రధానంగా గాజువాక హౌస్ కమిటీ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించి అర్హులందరికీ పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు అవసరమయ్యే రెవెన్యూ సేవలన్నీ వారికి చేరువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, తహసీల్దార్ టి.శ్రీవల్లి, డీటీ త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నగిరిపై వైభవంగా కూడారై ఉత్సవం

అక్కిరెడ్డిపాలెం, జనవరి 11: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం కూడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీవారిని పంచామృతాలతో అభిషేకించి, ప్రత్యేక పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక వేదికపై గోదాదేవి, శ్రీనివాసులను ఆశీనులను గావించి మహా ప్రసాదాన్ని (చక్రపొంగలి) 108 వెండి పాత్రల్లో వేసి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో ట్రస్టీలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నైవేద్యం సమర్పించిన దృశ్యం

కల్యాణ వెంకన్న ఆలయంలో..

వేపగుంట/ఎన్ఏడీ జంక్షన్: నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో గోదాదేవికి ప్రీతిపాత్రమైన కూడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 108 పాత్రల్లో క్షీరాన్నం చేసి శ్రీరంగనాథునికి నివేదించిన రోజున కూడారై ఉత్సవాన్ని జరుపుతామని అర్చకులు శ్రీనివాసస్వామి తెలిపారు. అలాగే వేపగుంట బీసీకాలనీలోని వేంకటేశ్వరాలయంలోనూ కూడారై ఉత్సవాన్ని నిర్వహించారు. 90వ వార్డు పరిధి విమాననగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన కూడారై ఉత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'టీడీపీ-జనసేన అభ్యర్థుల విజయానికి కృషి'

ఆటోనగర్, జనవరి 11: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన అభ్యర్థుల విజయానికి ప్రతి జనసైనికుడు కృషి చేయాలని జనసేన పీఏసీ సభ్యులు కోన తాతారావు సూచించారు. శ్రీనగర్ జనసేన కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్ల వైసీపీ పాలనలో కక్ష సాధింపులు, అక్రమాలు, అరాచకాలు తప్ప ప్రజలకు వైసీపీ పాలనలో ఒరిగిందేమి లేదన్నారు. ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారనీ, ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమ గీతం పాడి, టీడీపీ-జనసేన అభ్యర్థులకు పట్టం కట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసైనికులు,వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీల దీక్షా శిబిరంలో కార్పొరేటర్ గంగారావు

నియంతలా వ్యహహరిస్తున్న సీఎం జగన్: కార్పొరేటర్ గంగారావు

పెందుర్తి, జనవరి 11: సీఎం జగన్ నియంతలా వ్యవహరిస్తూ అంగన్‌వాడీల పట్ల నిర్లక్ష్య ధోరణి చూపడం దారుణమని సీపీఎం నేత, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు మండిపడ్డారు. న్యాయ సమ్మతమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 31వ రోజుకు చేరుకుంది. ఇక్కడి అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి అంగన్‌వాడీలకు సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మొండి వైఖరిని వీడి అంగన్‌వాడీల గోడును పట్టించుకోవాలన్నారు. అంగన్‌వాడీలు, ఆయాలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, ఏఐటీయూసీ ప్రతినిధులు ఆర్.అనిత, బృంద, అంగన్‌వాడీల మండల శాఖ ప్రతినిధులు దేవి, లక్ష్మి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, జనవరి 11: పురుషోత్తపురం సబ్ స్టేషన్ 33/11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వేపగుంట ఏఈ డీవీ రమణమూర్తి ఈ కారణంగా కంఫర్ట్ హోమ్స్, బాలాజీనగర్, గాయత్రినగర్, గౌరీవిశ్వేశ్వరకాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, మరిడిమాంబ కాలనీ, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

విధుల్లో చేరిన పారిశుధ్య సిబ్బంది

పేరుకుపోయిన చెత్తాచెదారం తరలింపులో నిమగ్నం

గాజువాక, జనవరి 11: జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బంది సమ్మె విరమించి గురువారం నుంచి విధుల్లోకి చేరడంతో చెత్తాచెదారం తరలింపు పనులు ప్రారంభమయ్యాయి. పారిశుధ్య కార్మికులు పద్నాలుగు రోజుల పాటు నిరవధిక సమ్మెకు దిగడంతో వీధుల్లో పెద్దఎత్తున చెత్తాచెదారం పేరుకుపోయిన సంగతి తెలిసిందే. అయితే గురువారం నుంచి విధుల్లో చేరిన పారిశుధ్య సిబ్బంది గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను వాహనాల ద్వారా డంపింగ్ యార్డులను తరలిస్తున్నారు. గాజువాకలోని శివారు ప్రాంతాల్లో చెత్త పెద్దఎత్తున పేరుకుపోయినందున దీనిని తరలించేందుకు రెండు మూడు రోజులు పడుతుందని సిబ్బంది చెబుతున్నారు.

జోనల్ కార్యాలయం రోడ్డులో మురుగు ప్రవాహం

పారిశుధ్య కార్మికుల సమ్మె ప్రభావంతో డ్రైనేజీల్లో పూడిక తొలగించకపోవడం వల్ల అనేక ప్రాంతాల్లో మురుగు నీరు రహదారులపై ప్రవహిస్తోంది. ఇదే విధంగా జీవీఎంసీ జోనల్ కార్యాలయం రోడ్డు మీదుగా మురుగు నీరు పారుతుండడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్డులోనే ప్రధానంగా కోర్టు, ఆస్పత్రితో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో నిత్యం ఈ రహదారిలో రద్దీ ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



గాజువాకలో పారిశుధ్య పనుల్లో నిమగ్నమైన కార్మికులు



జోనల్ కార్యాలయం రోడ్డులో పారుతున్న మురుగు నీరు

పెందుర్తి: సమ్మె విరమించడంతో విధుల్లో చేరిన పారిశుధ్య కార్మికులు డంపర్ల ద్వారా చెత్తాచెదారాన్ని తరలించారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, తదితరు ప్రాంతాల్లోని చెత్తను తరలించి, రహదారులను శుభ్రం చేశారు. చెత్త తరలింపుతో దుర్వాసన నుంచి విముక్తి లభించిదని పలువురు స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

చెత్త కుప్పలకు నిప్పు

కూర్మన్నపాలెం: పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించినప్పటికీ పలు వార్డుల్లో ఇంకా చెత్తాచెదారాన్ని తరలించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 87వ వార్డు పరిధిలోని కణితి, అపెరల్ పార్కు రోడ్డు, ఆటోనగర్, వడ్లపూడి, 71వ వార్డు ఆటోనగర్, శ్రీనగర్‌లలో చెత్తాచెదారం రోజుల తరబడి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పలువురు ఎక్కడికక్క చెత్త కుప్పలకు నిప్పు పెడుతున్నారు. దీంతో వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించినందున చెత్త తరలింపనకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటోనగర్‌లో చెత్త కుప్పకు నిప్పు పెట్టిన దృశ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఓపెన్ క్యూబ్ సీఈవో వినోద్‌కుమార్

అట్టహాసంగా విజ్ఞాన్ ఫెస్ట్ ప్రారంభం

అగనంపూడి, జనవరి 11: విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ విజ్ఞాన్ యువ తరంగ్ 2కె24 ఫెస్టివల్ గురువారం దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో అట్టహాసంగా ప్రారంభమైంది. విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా వివిధ అంశాల్లో పాల్గొని సందడి చేశారు. ఏటా మాదిరిగానే చేపట్టిన ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పెద్ద అధిక సంఖ్యలో పాల్గొన్నారు. త్రోబాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టెన్నీకాయిట్, క్రికెట్, రంగవల్లులు, పెయింటింగ్ వంటి పోటీల్లో ఉత్సాభరితంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అలాగే పాశ్చాత్య, శాస్త్రీయ ఆధునిక నృత్యాలతో ఆకట్టుకున్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని రాణించాలి: ఓపెన్ క్యూబ్ సీఈవో వినోద్‌కుమార్

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఓపెన్ క్యూబ్ సీఈవో పి.వినోద్‌కుమార్ అన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఫెస్ట్‌కు గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చదువు ఎంత ముఖ్యమో సృజనాత్మకమైన ఆలోచలనలు, న్యాయకత్వ లక్షణాలు కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రిన్సిపాల్ జె.సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకమైన ఆలోచనలు పెంపొదించాలనే లక్ష్యంతోనే ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు వినోద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాళ్లు అరుంధతి, వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ రవీంద్ర, ఫెస్టివల్ కన్వీనర్ బి.సతీశ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అలరించిన హితేశ్‌సాయి

యువ తరంగ్‌లో బ్లూ పోర్ట్ బ్యాండ్ గాయకుడు బి.హితేశ్ సాయి ఆహూతులను అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు టాలెంట్‌ను బయటకు తీయడానికి విజ్ఞాన్ ఏర్పాటు చేస్తున్న యువ తరంగ్ ఫెస్ట్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం ఆయన పలు పాటలు పాడుతూ డ్యాన్స్ చేసి అందరినీ ఆకట్టుకున్నారు.

'ఆడారి' ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

గోపాలపట్నం, జనవరి 11: సనాతన ఆచార సంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని, భావితరాలకు వాటిని అందించేందుకు కృషి చేయాలని వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించిన ఆనంద్‌కుమార్‌ను అభినందించారు. ఆడారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా అన్ని వార్డుల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో సుమారు 1,500 మంది మహిళలు పాల్గొన్నారన్నారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు బెహరా భాస్కరరావు, పీవీ సురేశ్, అయితంశెట్టి కోటేశ్వరరావు, పైడిరాజు, గోపి, తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్, ఆడారి ఆనంద్‌కుమార్

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

గాజువాక, జనవరి 11: గాజువాక నియోజకవర్గంలో ఎట్టకేలకు శుక్రవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నారు. బీసీ రోడ్డులోని శివాలయ ప్రాంగణంలో పట్టాల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏపీఐఐసీ, 301, 388 జీవోల ప్రకారం నియోజకవర్గంలో సుమారుగా 7,223 మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించారు.

ముదపాక భూముల్లో కన్వేయన్స్ డీడ్స్ చేయవద్దని ఆదేశాలు

పెందుర్తి, జనవరి 11: మండలంలోని ముదపాకలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు కోసం రెవెన్యూ యంత్రాంగం చేపట్టిన భూ సమీకరణ ఆదినుంచీ వివాదస్పదమవుతోంది. ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన రైతులకు పరిహారం కింద ఎల్‌పీవో సీలు వివాదాస్పదం కావడం, ల్యాండ్ పూలింగ్‌ను అంగీకరించని రైతులు కోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో తెచ్చుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గురువారం కోర్టులో వ్యాజ్యాలు కొనసాగుతున్న కొన్ని సర్వే నంబర్లలో గల వివాదస్పద భూములపై కన్వేయన్స్ డీడ్స్ చేయవద్దని జిల్లా అధికారులకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసిందని కోర్టునాశ్రయించిన రైతులు తెలిపారు. సర్వే నంబర్లు 1, 76, 66, 80, 82, 83లలో ఉన్న డీపట్టా భూములుపై ఎలాంటి కన్వేయన్స్ డీడ్స్ చేయవద్దని హైకోర్టు ఆదేశించినట్టు రైతులు కొర్రాయి రామలక్ష్మి, కోరాడ లక్ష్మి, గొలగాని రాము, గొంప అప్పలరాజు, పఠ్రి రామునాయుడు తెలిపారు.

జనసేన పార్టీలోకి మాజీ జెడ్పీటీసీ 'కంచిపాటి'

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా పెందుర్తి నియోజకవర్గానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కంచిపాటి విశ్వనాథనాయుడు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో అధినేత పవన్‌కళ్యాణ్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో తనకు ఎటువంటి బాధ్యతలు అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేస్తానని, పార్టీ విజయానికి కృషి చేస్తానని కంచిపాటి పేర్కొన్నారు.



పవన్‌కల్యాణ్‌తో కంచిపాటి విశ్వనాథనాయుడు

వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు: 'పశ్చిమ' ఎమ్మెల్యే గణబాబు

సింధియా, జనవరి 11: వైసీపీ అవినీతి, అక్రమ పాలనను ప్రజలు గుర్తించారని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 40వ వార్డు పరిధి జైయాంధ్ర కాలనీలో గురువారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పలువురికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్న టీడీపీ నాయకులు ఆర్ఆర్‌రాజు, శ్రీకాంత్, మనోహర్, కుమార్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీపేట (కంచరపాలెం): వైసీపీ పాలనలో ప్రజలకు అవస్థలు తప్పడం లేదని ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. 56వ వార్డులోని మురుకువాడలైన చాకలిగెడ్డ, ముత్యమాంబకాలనీల్లో 'భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. దయానందనగర్, చాకలిగెడ్డ, ముత్యమాంబకాలనీలో పేదలకు టిడ్కో ఇళ్లు ఇచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పదో రోజుకు నిరసన దీక్షలు

శ్రీనగర్, జనవరి 11: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ గాజువాక నీటి సరఫరా విభాగం కార్మికులు శ్రీనగర్ పంప్ హౌస్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలు గురువారం నాటికి పదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకలు సత్యం, సతీశ్‌లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నాన్ పీహెచ్ అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సినిమా గైడ్

- **గుంటూరు కారం :** జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, శరత్, శ్రీరామ, సంగం, వెంకటేశ్వర-1, వెంకటేశ్వర-2, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక) లక్ష్మి (గాజువాక) విశేష్, (గాజువాక) మోహిని (గాజువాక) కన్య-1 (గాజువాక), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మౌర్య (గోపాలపట్నం), మినీ మోహిని, విశేష్ (గాజువాక),
- **బబుల్ గమ్:** నటరాజ్-2(పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** శ్రీరామ, నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **హాయ్ నాన్న :** గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 24, క్యాబేజీ 17, క్యారెట్ 34, దొండకాయలు 30, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 115, , మునక్కాడలు (కిలో) 76, బరబాటి 44, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 28, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 50, చిలగడదుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	599
విజయనగరం	603
శ్రీకాకుళం	603

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	75
ఫారం ధర	--	95
విత్ స్కిన్	--	160
స్కిన్‌లెస్	--	170

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..



బారులు తీరిన భక్తులు



సహస్ర ఘటాభిషేకంలో కలశాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో శిరీష

కనకమహాలక్ష్మికి సహస్ర ఘటాభిషేకం

- ముగిసిన మార్గశిర మాసోత్సవాలు
- చివరి గురువారం పూజలకు పోటెత్తిన భక్తులు

జగదాంబ కూడలి, జనవరి 11: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాస ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆఖరి గురువారం కావడంతో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రత్యేక పూజల్లో ఈవో కె.శిరీష, ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఒంటి గంట సమయంలో దర్శనాలకు భక్తులను అనుమతించారు. అప్పటినుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మార్గశిర ఆఖరి గురువారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక హోమం, త్రికాల పంచామృతాభిషేకం, కలశపూజ తదితర సేవలను ఘనంగా జరిపారు. జగన్నాథుని ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పాల్గొన్నారు. భక్తులకు బూరెలు, పులిహోర, స్వీట్‌ను భోజనంతో కలిపి వడ్డించారు. సాయంత్రం నాలుగు గంటల నుండి దర్శనాలను పూర్తి నిలిపివేశారు.

అనంతరం నిర్వహించిన అమ్మవారి సహస్రఘటాభిషేకంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కలశాలతో జలం తీసుకువచ్చి అభిషేకం చేశారు. రాత్రి 7గంటల తర్వాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులను తిరిగి దర్శనాలకు అనుమతించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తుతో పర్యవేక్షించారు.

మెడ్‌టెక్ జోన్‌లో సోలార్ ట్రై సైకిళ్లు



సోలార్ పవర్‌తో నడిచే ట్రైసైకిళ్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం శివార్లలో గల ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో సోలార్ విద్యుత్‌తో నడిచే ట్రైసైకిళ్ల (వీల్ చైర్లు)ను తయారుచేశారు.ఢిల్లీకి చెందిన ఐసీఎంఆర్ సంస్థ దీనినిరూపొందించగా, ఇక్కడి మెడ్‌టెక్ జోన్‌లో తయారుచేశారు. దీనిని గురువారం ఆవిష్కరించారు. కాలుష్య నివారణకు, భద్రతకు ఇది దోహదపడుతుందని మెడ్‌టెక్ జోన్ అధికారులు పేర్కొన్నారు.

క్లీన్ వైజాగ్

... 5వ పేజీ తరువాయి

ఆరో స్థానం, 8,751.3 మార్కులతో విజయవాడ ఆరు, 8,728.3 మార్కులతో న్యూఢిల్లీ ఏడు, 8,624.50 మార్కులతో తిరుపతి ఎనిమిది, 8,601.30 మార్కులతో హైదరాబాద్ తొమ్మిది, 8,595.2 మార్కులతో పూణే పదో స్థానంలో నిలిచాయి.

237 నుంచి నాలుగో ర్యాంక్‌కు....

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛసర్వేక్షణ్ పోటీకి శ్రీకారం చుట్టినప్పటి నుంచి విశాఖ నగరం క్రమంగా ర్యాంకులను మెరుగుపరుచుకుంటూ వస్తోంది. పోటీ ప్రారంభించిన తొలిఏడాది 2015లో 237, 2016లో ఐదు, 2017లో మూడు, 2018లో ఏడు, 2019లో 23, 2020, 2021లో తొమ్మిది, 2022తోపాటు 2023 పోటీల్లో నాలుగో ర్యాంకు దక్కించుకుంది.

కబ్జాదారుల కోసమే భూ హక్కు చట్టం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



న్యాయవాదుల శిబిరంలో మాట్లాడుతున్న రామకృష్ణ

మహారాణిపేట, జనవరి 11: వైసీపీ ప్రభుత్వం దొడ్డిదారిన తీసుకువచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును నిరసిస్తూ విశాఖ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ యాజమాన్యహక్కు చట్టం భూ కబ్జాదారుల కోసం తీసుకువచ్చినట్టు ప్రజలకుఆందోళన చెందుతున్నారన్నారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చే యాలన్నారు. ప్రధాని మోదీ మెప్పు కోసం.. అమిత్ షా కాళ్లు పట్టడానికి ముఖ్యమంత్రి జగన్ ఈ చట్టం తీసుకువచ్చారన్నారు. నీతి అయోగ్, కేంద్ర ప్రభుత్వం సూచనలపై ఈ చట్టం తీసుకు వచ్చినట్టు వైసీపీ ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

విశ్వసనీయత కోల్పోయిన వైసీపీ సర్కార్

- పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు



సమావేశంలో గణబాబు, గండి బాబ్జీ

మహారాణిపేట, జనవరి 11: ప్రజల్లో వ్యతిరేకతతో వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేల మార్పు చేస్తున్నట్టు ప్రచారం చేస్తున్నా.. దీని వెనుక అధికార పార్టీపై ప్రజలు విశ్వసనీయ త కోల్పోయిందన్నది వాస్తవంగా గుర్తించాలని పశ్చిమ నియోజక వర్గం శాసన సభ్యుడు పీజీవీఆర్ గణబాబు అన్నారు.గురువారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. ముఖ్య మంత్రి జగన్‌ను ఇక, ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్నారు. ఈ స్థితిలో టీడీపీ సభలు విజయవంతమవుతుండగా, అధికార వైసీపీ చేస్తున్న సామాజిక సాధికార యాత్ర ఆదరణ కోల్పోయిందన్నారు. ప్రభు త్వంలో ఆర్థిక సంక్షోభంతో ప్రజలను భయాభ్రాంతులకు లోనుచేస్తోందన్నారు. సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు జగన్ మోసాలను అంతమొందించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి పాసర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

జయహో బీసీ కార్యక్రమం

మహారాణిపేట: టీడీపీ పాలనలో బీసీ వర్గాలకు న్యాయం చేకూరుతుందని గండి బాబ్జీ అన్నారు. దక్షిణ నియోజకవర్గంలో గురువారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు.బీసీ కమిటీ అధ్యక్షుడు టి విజయ్ కుమార్ , చింతాడ వరకుమార్ సీరం రాజేశ్, జి నరసింహాచారి పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

... 5వ పేజీ తరువాయి

కుటుంబంలో తులసీరావు కుమారుడు ఆడారి ఆనంద్‌కుమార్‌కు విశాఖ పశ్చిమ నుంచి పోటీ చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఎప్పుడో వచ్చేసింది. ఒకే కుటుంబంలో ఇద్దరికి టిక్కెట్లు ఇస్తారా?...అని కొందరు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. లేదంటే...గవర సామాజిక వర్గంలో ఇంకెవరికైనా అవకాశం ఇవ్వవచ్చునంటున్నారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకులు బొడ్డేటి కాశీ విశ్వనాథం అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఎంపీగా ఎవరు పోటీలో దిగినా భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందుకు తగిన ఆర్థిక వనరులు ఉన్నవారినే పార్టీ ఎంపిక చేస్తుంది. ఇదిలావుండగా సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సత్యవతి మరోమారు తనకు అవకాశం ఇవ్వాల్సిందిగా పార్టీ పెద్దలను కోరారు. ఒకవేళ సమీకరణాల వల్ల ఎంపీ సీటు ఇవ్వలేకపోతే అసెంబ్లీ టికెట్ అయినా ఇవ్వాలని ఆమె కోరుతున్నారు.

80 పైబడితే.. ఇంటి నుంచే ఓటు

... 5వ పేజీ తరువాయి

అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులు ఖరారైన తరువాత అందుకు అవకాశం కల్పిస్తారు. పోలింగ్‌కు ఒకటి, రెండు రోజులు ముందు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి నేతృత్వంలో పోలింగ్ సిబ్బంది వృద్ధుల ఇంటికి వెళ్లి బ్యాలెట్ పత్రం ఇస్తారు. ఓటు వేసిన తరువాత సీల్డు కవర్‌లో పెట్టి తమతో తీసుకువెళ్లిన బాక్సులో వేసే అవకాశం కల్పిస్తారు. రాజకీయ పార్టీలు నియమించుకునే పోలింగ్ ఏజెంట్లు కూడా వారి వెంట ఉంటారు. కాగా ఇంటి వద్ద నుంచి ఓటు వినియోగించుకోదలచిన వారు ఎక్కువ ఉంటే అదనపు సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని రిటైర్డు తహసీల్దార్ ఒకరు అభిప్రాయపడ్డారు. అయితే 80 ఏళ్లు దాటినవారు పోలింగ్ కేంద్రానికి వెళ్లి కూడా ఓటు వేసుకోవచ్చు.

ఆ భూములు ఎలాగైనా అమ్మేద్దాం!

... 5వ పేజీ తరువాయి

ఎవరూ ముందుకు రావడం లేదని గ్రహించి రూటు మార్చారు. 48 ఎకరాల భూమిని ఈసారి 76 ప్లాట్లుగా విభజించారు. మూడు వేల గజాల మొదలుకొని పది వేల గజాల వరకు ప్లాట్లుగా విభజించారు. అప్‌సెట్ ధర కూడా తగ్గించారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధర గజం రూ.50 వేలు ఉండగా, రాజీవ్ స్వగృహ అధికారులు ఇప్పుడు అప్‌సెట్ ధర గజం రూ.60 వేలుగా నిర్ణయించారు. అక్కడ నుంచి ఎవరు ఎక్కువ ధర పెట్టడానికి ముందుకువస్తే వారికి ప్లాట్లు ఇస్తారు. వేలంలో పాల్గొనే వారు ఇప్పుడు కోటి రూపాయలు డిపాజిట్‌గా చెల్లిస్తే సరిపోతుందని నిబంధన మార్చారు. రాజీవ్ స్వగృహకు ఈ భూమి కేటాయించినప్పుడు అంతా కొండ ప్రాంతం. మొదట్లో కొండను తవ్వి పైకి రహదారి నిర్మించడానికి రూ.20 కోట్లు వెచ్చించారు. తాజాగా దీనిని లేఅవుట్‌గా మార్చినప్పుడు మరో రూ.10 కోట్లు పెట్టి రహదారులు, కాలువలు నిర్మించారు. మొత్తంగా దీనిపై రూ.30 కోట్లు పెట్టారు. ఇప్పుడు అక్కడ ఎలా ఉంటే అదే స్థితిలో విక్రయిస్తామనే విధానంలో వేలానికి పెట్టారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 30 వరకు గడువు ఇచ్చారు. 31వ తేదీన ఆన్‌లైన్‌లో వేలం పెడతారు. ఈసారి ఎలాంటి ఆదరణ వస్తుందో చూడాలి. ఇంకో రెండు నెలల్లో ఎన్నికల ప్రకటన వస్తుంది. ఇటువంటి సమయంలో ఈ భూమి వేలానికి ఎటువంటి స్పందన లభిస్తుందో చూడాల్సి ఉంది.

23, 639 మందికి 'జగనన్నతోడు': కలెక్టర్

మహారాణిపేట, జనవరి 11: జగనన్న తోడు పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 23,639 మంది లబ్ధిపొందినట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున తెలిపారు. వృత్తి కళాకారులు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారుల ఆదాయాలను మరింతగా మెరుగు పరిచేందుకు ని ర్దేశించిన జగనన్న తోడు పథకం 8 వ విడత నిధులను గురువారం ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంనుంచి వీడియో కా న్ఫరెన్స్ ద్వారా విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా 60.72 లక్షల వడ్డీ రాయితీ, 17,469 మందికి 14.48 లక్షల కొత్త రుణాల నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ పాపినాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు.

40 మంది ఫార్మా సిటీ భూ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు

మహారాణిపేట, జనవరి 11: పరవాడ ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన 40 మంది నిర్వాసితులకు గురువారం లాటరీ ద్వారా ఇళ్ల స్థలాలనుకేటాయించినట్టు జాయింట్ కలెక్టర్ కే విశ్వనాథన్ తెలి పారు. లోకాయుక్త ద్వారా 25 మంది, స్పందన ద్వారా 15 మంది మొత్తం 40 ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తులు అందాయని తెలిపారు. వీరికి లాటరీ ద్వారా స్థలాలను కేటాయించామన్నారు. రెండు రోజుల్లో అందించనున్నట్టు చెప్పారు.

ఢిల్లేశ్వరరావుకు మిస్టర్ ఏయూ శరీర సౌష్టవ టైటిల్



టైటిల్ విజేత ఢిల్లేశ్వరరావు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జనవరి 11: ఏయూ అంతర్ కళాశాలల శరీర సౌష్టవ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థి వై.ఢిల్లేశ్వర రావు మిస్టర్ ఏయూ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. గురువారం కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ టోర్నీలో కాలేజీ బాడీ బిల్డర్లు ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని సొంతం చేసుకున్నారు. బాడీ బిల్డింగ్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కే గురునాధరావు, టి.రాము, డాక్టర్ రత్నాకర్, ఈవీవీఎస్.శివకుమార్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీ.రమణాచారి (రైల్వే) కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, గంగా భవాని పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గంలో 40 వేల దొంగ ఓట్లు

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు



మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, జనవరి 11: ఉత్తర నియోజకవర్గంలో ఇంటింటికి ఓటర్ పరిశీలన జరిగిందని, ఈ నేపథ్యంలో 40 వేల మంది దొంగ ఓట్లు ఉన్నట్టు గుర్తించినట్టు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. బోగస్ ఓట్లపై జిల్లా అధికారులు డీఆర్వో, ఈఆర్ఓకి ఫిర్యాదు చేసినట్టు ఆయన వివరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరులో ఇచ్చిన డ్రాఫ్టలిస్ట్‌లో దొంగ ఓట్లను డిలీట్ చేయకుండా ఉంచారని, దీనిపై రా ష్ట్ర ఎన్నికల అధికారికి సమాచారం అందించినట్టు చెప్పారు.

కనకమహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరీ



అలంకరణలో కన్యకాపరమేశ్వరి

మహారాణిపేట, జనవరి 11: కన్యకాపరమేశ్వరి ఆలయంలో మార్గశిర మాసం ఆఖరి గురువారంపురస్కరించుకుని అమ్మవారు కనక మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. 108 బంగారు పుష్పాల నివేదనలతో కూడిన ప్రత్యేక అలంకరిం చారు. సుమారు 250 మంది మహిళలతో సా మూహిక కుంకుమ పూజలు, విష్ణు సహ స్రపారాయణం నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్య దర్శులు ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామ కృష్ణారావు, సుగుణ, శివ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సంక్రాంతి వేడుకలు

డాబాగార్డెన్స్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సేవా కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం సంకాంత్రి వేడుకలను నిర్వహించారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఈ వేడుకలను జీవీఎంసీ జేడీ వై.శ్రీనివాసరావు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి కే రామేశ్వరి హాజరై ప్రారంభించారు. గంట్ల శ్రీనుబాబు, సత్యవతి, మురళీ, పావని, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మచిత్రం పుస్తకావిష్కరణ

సీతంపేట, జనవరి 11: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శ్రీ విశ్వ కళ్యాణ భారతీ సేవా సంఘం ఆధ్వర్యంలో రచయిత కిలాడి సత్యనారాయణ రచించిన ఆత్మచిత్రం పుస్తకాన్ని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆవిష్కరించారు.జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ కేదార్నాథ్ సింగ్ కవిత్వాన్ని అనువదించడం ప్రశంసనీయమన్నారు. డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, వైద్య నిపుణులు డాక్టర్ బిపిఎస్ కల్యాణి, ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, గీతం యూనివర్శిటీ ప్రొఫెసర్ భగవతం, రచయిత కొత్తగూడెం, పోర్టు ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ దూబే, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'యూనియన్ల లబ్ధికే మున్సిపల్ సమ్మె'

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యూనియన్ల ఉనికికి, నేతల లబ్ధి కోసమే మున్సిపల్ కార్మికులతో సమ్మె చేయించారని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ జనరల్ వీవీవామనరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులసమావేశంలో మాట్లాడారు. సమానపనికి సమానవేతనండిమాండ్‌గా మున్సిపల్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యో గులు సమ్మెకు దిగితే, దానిపై కనీసం చర్చ జరగకుండానే సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు యూనియన్ల నేతలు విజయోత్సవసభ నిర్వహించడం విడ్డూరమన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె విరమణ

విశాఖపట్నం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టుపరిధిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం రాత్రి సమ్మె విరమించారు. సర్వీస్ రెగ్యులేషన్, హెచ్ఆర్‌పాలసీ అమలు, సమాన పనికి సమాన వేతనం వంటి డిమాండ్ల సాధనకు గతనెల 20వతేదీ నుంచి సమ్మెలోనికి వెళుతూ జిల్లా కేంద్రాల్లో ఆందోళన చేపట్టారు. అయితే రాష్ట్ర ప్రభుత్వంతో ఉద్యోగుల జేఏసీ విజయవాడలో చేపట్టిన చర్చల మేరకు సమ్మె విరమించారు. జిల్లాలో సుమారు 320మంది ఉద్యోగులు గురువారం విధుల్లో చేరారు.

హిందీ టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాఖపట్నం, జనవరి 11: విశ్వ హిందు దివాస్‌ను పురస్కరించుకుని వాల్తేరు డివిజన్ హిందీ రాజ భాష శాఖ రూపొందించిన హిందీ టేబుల్ క్యాలెండర్‌ను డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అలాగే ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో ఏర్పాటు చేసిన హిందీ లైబ్రరీని ప్రారంభించారు. అనంతరం హిందీ కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. క్యాలెండర్‌ను రూపొందించిన హిందీ శాఖ సూపరింటెండెంట్ సుధీష్ణ అభినందించారు. ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

కోస్టుగార్డును సందర్శించిన కస్టమ్స్ అధికారులు



పర్యటనకు వచ్చిన కోస్ట్‌గార్డులు

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, పుణే, వెల్లింగ్‌టన్ ప్రాంతాల్లో హయ్యర్ కమాండ్ కోర్సులు అధ్యయనం చేస్తున్న 529 మంది విద్యార్థి అధికారులు, వారి బోధన సిబ్బందికి తూర్పు నౌకాదళం ఆతిథ్యమిచ్చింది. నాలుగు రోజుల పర్యటనకు వచ్చిన వీరితో ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సముద్ర పర్యటనకి తీసుకెళ్లి అన్నీ వివరించారు.

529 మందికి ఆతిథ్యం

కస్టమ్స్ విభాగంలో ప్రివెంటివ్ అధికారులుగా పనిచేస్తున్న వారికి కోస్టుగార్డుపై అవగాహన కు శుక్రవారం నౌకల సందర్శనకు తీసుకెళ్లారు. కోస్టుగార్డు పనితీరుపై అవగాహన కల్పించారు. విధుల్లో సామర్థ్యంపెంపులోభాగంగా దీనిని నిర్వహించారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా జరపాలి: జనసేన

సీతంపేట, జనవరి 11: ఎన్నికలను నిష్పక్షపాతంగా జరపాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ కేంద్రంగా రాష్ట్రంలో జరుగుతున్న ఓట్ల తొలగింపుపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి వివరించారన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు నాగలక్ష్మి చౌదరి, త్రివేణి, కిరణ్ ప్రసాద్, మంతా నాగ సుధ, రూప, పోతు వెంకట ప్రసాద్, బంటు రవి పాల్గొన్నారు. పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రచార కమిటీ చైర్మన్ బన్నీ వాసు రూపొందించిన మన ఊరు-మన ఆట కార్యక్రమం పోస్టర్‌ని నాగలక్ష్మి ఆవిష్కరించారు.

సాయి మందిరంలో వైద్య శిబిరం

అక్కయ్యపాలెం : గ్రేటర్ 42వ వార్డు రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయిధ్యానమందిరం ప్రాంగణంలో మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి, మెడికవర్ ఆస్పత్రులు, సంధ్య డెంటల్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు వివిధ వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, ఓప్టోమెట్రిస్ట్ సునీత, కౌన్సెలర్ రుషిక, మెడికవర్ ఆస్పత్రి ప్రతినిధి కె.అప్పారావు, సంధ్య డెంటల్ క్లినిక్ వైద్యురాలు రేష్మ పాల్గొన్నారు.

2 నుంచి భారత్, ఇంగ్లాండ్ మధ్య టెస్ట్ మ్యాచ్

- 2 వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం
- ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 26నుంచి టికెట్ల విక్రయం
- ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి



మాట్లాడుతున్న శరత్‌చంద్రారెడ్డి తదితరులు

మధురవాడ, జనవరి 11: పోతిన మల్లయ్యపాలెం ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో వచ్చే నెల 2 నుంచి ఆరో తేదీ వరకు భారత్, ఇంగ్లాండ్ మధ్య రెండో టెస్ట్‌మ్యాచ్ జరగనున్నట్టు ఏసీఏ అధ్యక్షుడు పి.శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం స్టేడియంలో మీడియాతో మాట్లాడారు. మ్యాచ్ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, ఏసీఏ ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించామన్నారు. ఇక్కడి స్టేడియంలో ఇది మూడో టెస్ట్‌మ్యాచ్ అని, మ్యాచ్‌కు నగర పరిధిలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తామన్నారు. కాగా ఈనెల 26వ తేదీ నుంచి ఆరో తేదీ వరకు స్టేడియంతో పాటు నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆఫ్‌లైన్‌లో టికెట్లు విక్రయిస్తామన్నారు. ఈనెల 15 నుంచి ఆన్‌లైన్‌లో పేటీఎం యాప్ ద్వారా టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. రోజు వారీ టికెట్ల ధరలు రూ.100, రూ.200, రూ.300, రూ.500గా నిర్ణయించామన్నారు. మ్యాచ్ మొత్తానికి (సీజనల్ టికెట్) రూ.400, రూ.800, రూ.1000, రూ.1500గా నిర్ణయించామన్నారు. అనంతరం కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ టెస్ట్‌మ్యాచ్‌కు వచ్చే క్రికెటర్లతో పాటు క్రీడాభిమానులకు తగిన భద్రత కల్పిస్తామన్నారు. తాగునీరు, పారిశుధ్యం నిర్వహణ, పార్కింగ్ తదితర ఏర్పాట్లు పరిశీలిస్తున్నామన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ ఎప్పటిలాగే క్రికెటర్లకు మూడంచెల భద్రత కల్పిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని వివరించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, ఏసీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షతల పంపిణీ



అక్షతలను ఊరేగిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జనవరి 11: గ్రేటర్ 42, 43, 44 వార్డుల్లో అయోధ్య రాముని అక్షతల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. శ్రీనివాస నగర్‌లో ప్రాంతంలోని సాయిబాబా, వేంకటేశ్వర స్వామి ఆలయాల నుంచి ముందుగా పురవీధుల్లో స్వామివారి అక్షతలతో బీజేపీ వార్డు అధ్యక్షుడు మోకిని సత్తిబాబు రాధ దంపతుల ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. నాయకులు ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి, ఆలయ చైర్మన్ నాయుడు, అర్చకుడు సంతోష్‌కుమార్, అంకారావు, కొండబాబు పాల్గొన్నారు.

ఘనంగా కూడారై ఉత్సవం



స్వామివారికి నివేదించిన మహా ప్రసాదం

భీమునిపట్నం, జనవరి 11: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఐశ్వర్య వెంకటేశ్వరాలయంలో గురువారం కూడారై ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు పురాణం శేషాచార్యులు 108 గంగాళాలతో అక్కరడిషల్ మహా ప్రసాదాన్ని స్వామికి నివేదించారు. ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కేఎస్ఎన్ మూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరుని సన్నిధిలో...

సింహాచలం: స్థానిక వేంకటేశ్వరుని సన్నిధిలో గురువారం ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి తులసి, చామంతి, మందార మాలికల మధ్య వేదికపై ఉంచారు. షోడశోపచారాల తరువాత తిరుప్పావైలోని 26వ పాశురాన్ని అనుసంధానం చేశారు.

చెత్త సేకరణపై అవగాహన

భీమునిపట్నం (రూరల్): ఇళ్లనుంచి తడి, పొడి చెత్త సేకరణపై మహిళా గ్రూపులతో చైతన్యానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎడదాసరిపేట, రాయిపాలెం, నమ్మివానిపేట, ఏతపేట, గొల్లలపాలెం, కుమ్మరిపాలెం తదితర గ్రామాలు, అపార్టుమెంట్లున్న ప్రాంతాలలో వీరు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

'ఐక్య పోరాటాలతోనే విజయం'

సాగర్‌నగర్, జనవరి 11: ఐక్య పోరాటాలతోనే విజయం సాధ్యమని ఏఐటీయూసీ అధ్యక్షుడు పడాల రమణ అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపల్ కార్మికులతో ప్రభుత్వం చర్చలు సఫలమయ్యాయని, ఈ రంగంలో పనిచేస్తున్న అన్ని కార్మిక సంఘాలజేఏసీ ఆధ్వర్యంలో ఐక్య పోరాటం చేసి విజయం సాధించామన్నారు. కె.సత్యనారాయణ, బి.దుర్గారావు, ఎల్.వెంకటేష్, పి.కిషోర్, శేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి టిడ్కో గృహాలు సిద్ధం

మధురవాడ, జనవరి 11: జీవీఎంసీ ఏడో వార్డు పరిధి మధురవాడ సుద్దగెడ్డ వారన పేదల కోసం నిర్మించిన పక్కాగృహాలు పంపిణీకి సిద్ధమయ్యాయి. త్వరలోనే వీటిని లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2016-17లో సుద్దగెడ్డ వద్ద 5 బ్లాకుల్లో 240 గృహనిర్మాణం ప్రారంభించారు. ఐదు బ్లాకుల చుట్టూ రహదారులు, వీధిలైట్లు, తాగునీటి పైప్‌లైన్లు, గృహాల్లో పలుచోట్ల కొళాయలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయినా పంపిణీకే అధికారులు మొగ్గుచూపుతున్నారు.

సీపీఐలో పలువురి చేరిక

వెంకోజీపాలెం, జనవరి 11: తూర్పు నియోజకవర్గంలో 15 కుటుంబాలు గురువారం సీపీఐలో చేరారు. కృష్ణా కళాశాల సమీపంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు పడాల గోవింద్ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఎస్.మధురెడ్డి, కె.రాజు, కె.భాగ్య, విజయకుమార్, చిన్న, షేక్ మదీనావలి, నూర్జనీషాబేగం, బంగార్రాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు రేపు

భీమునిపట్నం, జనవరి 11: సంక్రాంతి సందర్భంగా ఈనెల 13న భీమిలి ప్రెస్‌క్లబ్ ముగ్గుల పోటీలు నిర్వహించనుంది. విజేతలకు బహుమతులు అందిస్తామని, ఆసక్తి గల వారు 7386956633, 7013576546 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదుచేసుకోవాలన్నారు.

సినిమా గైడ్

- **గుంటూరు కారం :** జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, శరత్, శ్రీరామ, సంగం, వెంకటేశ్వర-1, వెంకటేశ్వర-2, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక) లక్ష్మి (గాజువాక) విశేష్, (గాజువాక) మోహిని (గాజువాక) కన్య-1 (గాజువాక), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మౌర్య (గోపాలపట్నం), మినీ మోహిని, విశేష్ (గాజువాక),
- **బబుల్ గమ్:** నటరాజ్-2(పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** శ్రీరామ, నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **హాయ్ నాన్న:** గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 24, క్యాబేజి 17, క్యారెట్ 34, దొండకాయలు 30, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 115, బరబాటి 44, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 28, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 50, చిలగడదుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	599
విజయనగరం	603
శ్రీకాకుళం	603

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	75
ఫారం ధర	--	95
విత్ స్కిన్	--	160
స్కిన్‌లెస్	--	170

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

పతంగులొచ్చేశాయ్!

- తీరంలో అమ్మకానికి సిద్ధం
- విభిన్న డిజైన్లతో ఆకట్టుకుంటున్న గాలిపటాలు
- ధర రూ.30 నుంచి రూ.400 వరకు
- నగరానికి సంక్రాంతి శోభ





బీచ్ రోడ్డు అప్పుఘర్ వద్ద విక్రయానికి సిద్ధంగా గాలిపటాలు



విశాలాక్షినగర్, జనవరి 11: సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ.. రంగురంగుల గాలిపటాలతో కేరింతలు కొడుతూ చిన్నారులు జరుపుకునే పండుగ.. నింగికి నిచ్చెన వేసినట్టుగా గాలిపటాలను ఎగరేస్తూ చిన్న పెద్దా తేడా లేకుండా ఆనందంగా జరుపుకునే పండుగ. ఈ ఏడాది రంగురంగుల పతంగుల విక్రయాలు ప్రారంభమయ్యాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వీటి అమ్మకాలు చేపడుతున్నప్పటికీ, ముఖ్యంగా తీరంలో ఈ సందడి ఎక్కువగా కనిపిస్తుంది. కనుమ రోజున బీచ్‌రోడ్డులోనే అధికశాతం మంది గాలిపటాలను ఎగురవేస్తారు. ఈ క్రమంలో వ్యాపారులు కూడా ముందుగానే తీరం పొడవునా పతంగుల అమ్మకాలు ప్రారంభించారు. ప్రతిఏటా విభిన్న ఆకృతుల్లో రూపొందించిన పతంగులను విక్రయానికి సిద్ధం చేస్తుండగా... ఈ ఏడాది సరికొత్త డిజైన్లు మార్కెట్‌లోకి వచ్చేశాయి. అప్పుఘర్ వద్ద వివిధ రకాల గాలిపటాలను మంగళవారం నుంచి విక్రయానికి ఉంచారు. ఇందులో విభిన్న రంగులు గాలి పటాలు దర్శనమిస్తున్నాయి. ప్రజలకు బీచ్ రోడ్డులో ఆకాశంలో తేలియాడే ఆకర్షణీయమైన గాలిపటాను ఎగురవేస్తుంటారు ఈ క్రమంలో పక్షులు, స్పైడర్ మేన్, టెడ్డీ బేర్‌లను పోలేలా ఆకృతులతో అందుబాటులోకి వచ్చాయి. ఎక్కువగా పాలిథిన్ కవర్లతో రూపొందించినవే అమ్మకానికి ఉంచారు. అయితే క్లాత్‌తో తీర్చిదిద్దినవి కూడా ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్లో రూ.30 నుంచి రూ.400 వరకు రకాన్ని బట్టి ఒక్కో గాలిపటం విక్రయిస్తున్నారు. నాణ్యతతో విభిన్న డిజైన్లను హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి అమ్ముతున్నట్టు వ్యాపారులు వివరిస్తున్నారు. గాలిపటం ఎగురవేసేందుకు వీలుగా వాడే దారం (మాంజా)తో పక్షులకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతున్న నేపథ్యంలో దానిని నిషేధించారు. దీంతో ఈ ఏడాది కాటన్‌తో రూపొందించిన దారాలను విక్రయిస్తున్నామని వ్యాపారులు తెలిపారు.

సంక్రాంతి అందరికీ శుభాలు ఇవ్వాలి: ఎంపీ

విశాలాక్షినగర్, జనవరి 11: నగరంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎంపీ, వైసీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెంలో కార్పొరేటర్ స్వాతిదాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి అంటే రైతుల పండగన్నారు. సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం వెనకడుగు వేయడం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వార్డులో నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం భోగి మంటలు వేసి స్థానికులతో సంక్రాంతి సంబంరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి బీజేపీ సంక్రాంతి సంబరాలు

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో శుక్రవారం నుంచి బీజేపీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ప్రారంభం కానున్నాయి. మొదట సంక్రాంతి ముగ్గుల పోటీతో ఉదయం 10 గంటలకు ఈ సంబరాలను ప్రారంభిస్తున్నట్టు కన్వీనర్ చెరువు రామకోటయ్య తెలిపారు. పోటీలో మొదటి విజేతకు రూ.25,116 బహుమతితో పాటు 'ముగ్గుల మహారాణి" బిరుదు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. అలాగే ద్వితీయ, తృతీయ విజేతలకు ముగ్గుల రాణి, ముగ్గుల యువరాణి బిరుదులు ఇస్తూ రూ.10,116; రూ.5,116లు నగదు బహుమతి ఇస్తామన్నారు. సుమారుగా 500 మందికి ఏర్పాట్లు చేశామని, గంట ముందుగా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. సంబరాలు 15వ తేదీ వరకు ఉంటాయన్నారు.

రానున్నది జనసేన, టీడీపీ ప్రభుత్వమే

- జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్



మంగమారిపేటలో పార్టీ జెండాను ఆవిష్కరించిన పంచకర్ల సందీప్

భీమునిపట్నం, జనవరి 11: రాష్ట్రంలో రానున్నది జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వమేనని జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ అన్నారు. గురువారం మంగమారిపేట వద్ద గరికిన అప్పారావు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైసీపీ నిరంకుశపాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. నిత్యావసర సరకుల ధరలు, పన్నులతో సామాన్యుల జీవనం అతలాకుతలమైందన్నారు. తిమ్మాపురం జంక్షన్ నుంచి మంగమారిపేట వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీవీ కృష్ణయ్య, శేఖరి శ్రీనుబాబు, నాగోతి నరసింహనాయుడు, సంతోషినాయుడు, పరిమి భువనేశ్వరి, నక్క శ్రీధర్, శ్రీకాంత్‌రెడ్డి, పల్లా బాలు, రాజు, అనిల్, శ్రీను, మూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగారావు



అంగన్‌వాడీల ధర్నాలో మాట్లాడుతున్న గంగారావు

ఆనందపురం జనవరి 11: నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ప్రభుత్వం ఆపలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.గంగారావు హెచ్చరించారు. సమస్యలపై అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో గురువారం ఆనందపురం కూడలి వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీల డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం దిగిరావాలన్నారు. భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, అంగన్‌వాడీల వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షురాలు కె.వెంకటలక్ష్మి, జిల్లా కోశాధికారి కె.పద్మావతి, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదరులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి పాల్గొన్నారు. అంగన్‌వాడీలకు జనసేన సహకారం ఉంటుందని భీమిలి జనసేన ఇన్‌చార్జి సందీప్ పంచకర్ల అన్నారు. ఆనందపురం కూడలిలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందన్నారు. తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం వస్తుందని అంగన్‌వాడీల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మిన అప్పలరాజు, బీవీ కృష్ణయ్య, శేఖరి శ్రీను, నరసింహనాయుడు, సంతోషినాయుడు, పిళ్లా శ్రీను, బాలు, ప్రశాంత్ నాయుడు, తాడివాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గీతం' ఆధ్వర్యంలో కళ్లద్దాల పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, జనవరి 11: ప్రతి ఒక్కరు కళ్లను కాపాడుకోవాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. గీతం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం పదో వార్డు వివేకానందనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎస్ఐజినగర్ లో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మిరాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గీతం మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో మరిన్ని శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గాడు అప్పలనాయుడు, కేతా సత్యనారాయణ, జనసేన నేతలు బండి రాజారమేష్, అన్నం తిరుపతిరావు, మద్ది రాజేష్, కొండమ్మ, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు సముచిత గౌరవం



మాట్లాడుతున్న రాజబాబు

భీమునిపట్నం, జనవరి 11: తెలుగుదేశంలోనే బీసీలకు సముచిత గౌరవం లభించిందని భీమిలి ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు 152 కార్పొరేషన్లు ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి వాటికి నిధులు ఇవ్వలేదని విమర్శించారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో సామంతరాజులుగా రెడ్డి నేతలనే ఇన్‌చార్జిలుగా నియమించారన్నారు. చంద్రబాబు జయహో బీసీ నినాదంతో కార్యక్రమానికి చేపట్టడానికి ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, అప్పలనాయుడు, సంజీవ్ కుమార్, కామేశ్, వంశీ పాల్గొన్నారు.

నేర నియంత్రణపై ప్రజలను చైతన్య పరచాలి

- క్రైమ్ డీసీపీ వెంకటరత్నం



సీఐ, ఎస్ఐలకు సూచనలిస్తున్న డీసీపీ వెంకటరత్నం

తగరపువలస/భీమునిపట్నం, జనవరి 11: నేరాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేసే దిశగా వారిలో చైతన్యం తీసుకురావాలని క్రైమ్ డీసీపీ పి.వెంకటరత్నం పోలీసులకు సూచించారు. తగరపువలసలో ఇటీవల జరిగిన చోరీపై పరిశీలనకు గురువారం ఆమె వచ్చారు. చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి, బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం పోలీసింగ్‌లో ఓ భాగమన్నారు. కొత్తవ్యక్తుల సంచారంపై ప్రజలు పోలీసులకు సమాచారాన్ని అందించాలని కోరారు. అపార్టుమెంటు వాసులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఆమె భీమిలి పోలీసుస్టేషన్‌లో కేసులు, వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీఐ డి.రమేష్, ఎస్ఐ పి.సూర్యప్రకాష్‌లకు తగు సూచనలు సలహాలు అందించారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

ఆరిలోవ: ఎస్‌కెఎల్ఎంనగర్‌లో గల కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకటలాడింది. మార్గశిర మాసం చివరి గురువారం సందర్భంగా భారీ ఎత్తున తరలివచ్చిన మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రసాదాలను నివేదనం చేశారు.

యాత కార్పొరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా రాములప్పడు

భీమునిపట్నం: ఏపీ యాత సంక్షేమ సేవా సంఘం కార్యదర్శిగా చేపలుప్పాడకు చెందిన బాడితబోయిన రాములప్పడును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, వైసీపీ నేతలు అభినందించారు.

భైరవస్వామి ఆలయంలో వైభవంగా అమావాస్య పూజలు



భైరవస్వామికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

సింహాచలం, జనవరి 12: సింహాచల దేవస్థానం ఉపాలయం భైరవస్వామికి భక్తులు గురువారం అమావాస్య పూజలు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వరాహ పుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసిన భక్తులు కాలినడకన భైరవవాక చేరుకున్నారు. కొందరు భక్తులు స్వామికి భస్మాభిషేకం, ఇతర అభిషేకాలు చేయగా, వడమాలలను సమర్పించారు. నువ్వుల నూనెతో దీపాలు వెలిగించారు.

అప్పన్నను దర్శించుకున్న మాజీ మంత్రి కిడారి

వరాహలక్ష్మీనృసింహస్వామిని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత కిడారి శ్రావణ్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ ఆత్మీయ స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్నకిడారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలను, అధికారులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు భైరవస్వామి ఆలయంలో కిడారి అభిషేకాలు, పూజలు జరిపించారు.

ధారోత్సవాలకు శ్రీకారం

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా ధారోత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేక పల్లకిలో మాడవీధుల్లో తిరువీధి నిర్వహించి, పవిత్ర గంగధార వద్ద పండ్ల రసాలు, పంచామృతాలు, పవిత్ర గంగధార జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అలంకరించి మండపంలో ఆస్థానం నిర్వహించి తిరుప్పావైలోని 26వ పాశురాన్ని అనుసంధానం చేశారు. ఆ తరువాత అమ్మవారిని ఆలయ ఆస్థానమండపంలో ఉంచి పూజలు చేసి తీర్థగోష్ఠి జరపడంతో ధారోత్సవాల (నీరాట్టోత్సవాలు)ముగిశాయి. ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు, ఏఈఓ భ్రమరాంబ పాల్గొన్నారు.

తొలి పంట సమర్పణకు ఏర్పాట్లు

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామికి భోగి పర్వదినాన గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతాంగ సమర్పించు తొలిపంటను స్వీకరించేందుకు దేవాలయ ప్రాంగణంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు దేవస్థానం ఈవో సింగాల శ్రీనివాసమూర్తి అధికారులతో కలిసి గురువారం క్షేత్ర పరిశీలన చేశారు. ఏటా తమ పొలాల్లో పండే వరితోపాటు ఇతర కూరలను, నూనె, నెయ్యి, పండ్లను అప్పన్నకు సమర్పించడం ఆచారంగా వస్తోంది. ఆ విధంగా రైతులు సమర్పించినవాటిని ఆలయ ఉత్తర రాజగోపురం వద్ద ఏర్పాటుచేసిన కౌంటర్ వద్ద సిబ్బంది గతేడాది వరకు తీసుకున్నారు. ఈ ఏడాది రైతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావించి టికెట్ల క్యూ ప్రవేశానికి సమీపంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఈవో ఆదేశించారు. ఈ పర్యటనలో దేవస్థానం పాలకమండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, ఏఈఓలు భ్రమరాంబ, నరసింగరావు, ఈఈలు డీజీ శ్రీనివాసరాజు, బి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన మండల అధ్యక్షులుగా శ్రీధర్, అప్పలరాజు



నక్కా శ్రీధర్



తమ్మిన అప్పలరాజు

భీమునిపట్నం/ఆనందపురం, జనవరి 11: జనసేన పార్టీ మండల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. భీమిలి మండలానికి మధురవాడ బిల్డర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు నక్కా శ్రీధర్, ఆనందపురం మండలానికి తమ్మిన అప్పలరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'

సింహాచలం: త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబును గెలిపించటం ద్వారానే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని గ్రేటర్ 98వ వార్డు టీడీపీ అధ్యక్షులు పంచదార్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం పోస్టాఫీసువీధిలో బీఎల్‌వో మజ్జి చంద్ర శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు గండ్రెడ్డి వెంకటరమణతో కలిసి బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

వలంటీరు కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

ఎండాడ, జనవరి 11: డాక్‌యార్డు ప్రాంత వార్డు సచివాలయంలో వలంటీరుగా పనిచేస్తున్న కె.దుర్గాభవాని ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె కుటుంబసభ్యులకు వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి గురువారం రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, దామా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జనవాహిని పార్టీ కార్యవర్గం

ఆరిలోవ. జనవరి 11: ఆరిలోవ ప్రాంతంలో జనవాహిని జాతీయ కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు డీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తమ పార్టీ తరఫున 40 మంది బరిలో నిలుస్తారన్నారు. ఏపీ అధ్యక్షుడు మేడిచర్ల మురళి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడికి చోడవరపు శంకర్, విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా రుద్రరాజు దిలీప్, కాకినాడ, బాపట్ల, గాజువాక అసెంబ్లీ కార్యవర్గాన్ని నియమించారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ చైర్మన్ రామచంద్రనాయుడు క్యాలెండర్ ఆవిష్కరించారు. పారిపిల్లి రామారావు, మురళి పాల్గొన్నారు.

దుర్గంధంతో స్థానికుల అవస్థలు



రహదారిపై చిందరవందరగా పేరుకుపోయిన చెత్త కుప్పలు

ఆరిలోవ, జనవరి 11: జీవీఎంసీ పదోవార్డు పాత డైరీ ఫారం పెట్రోలు బంకు నుంచి ఇందిరానగర్ రహదారిలో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. దీని నుంచి తీవ్ర దుర్గంధం వెలువడుతుండడంతో స్థానికులు, పాదచారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాజీవ్‌నగర్ వెటర్నరీ కాలనీ వాసులకు ఇదే ప్రధాన రహదారి కావడతో నిత్యం అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. సిబ్బంది చెత్తను వెంటనే తొలగించి సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.